నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

1

నిజామాబాద్-కామారెడ్డి

ఆదివారం సెప్టెంబర్ 29, 2024 www.navatelangana.com

రేపు ఆర్మూర్‌కు ఎక్సైజ్ శాఖ మంత్రి రాక

- ప్రారంభానికి సిద్ధమైన ఎక్సైజ్ కార్యాలయం

నవతెలంగాణ-ఆర్మూర్



ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు రేపు (సోమవారం) జిల్లాలో పర్యటించనున్నారు. ఇందులో భాగంగా పట్టణ పరిధిలోని మామిడిపల్లి పట్టణ పకృతి వనం దగ్గర నూతనంగా నిర్మించిన ఎక్సైజ్ శాఖ కార్యాలయాన్ని ప్రారంభించనున్నట్టు ఎక్సైజ్ సీఐ స్టీవెన్‌సన్ శనివారం తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రొహిబిషన్ డిప్యూటీ కమిషనర్ సోమిరెడ్డి, శ్రీధర్, కమలహాసన్ రెడ్డి, జిల్లా అధికారి మల్లారెడ్డి లతో పాటు ఎంపీ అరవింద్, రాష్ట్ర వ్యవసాయ సలహాదారులు పోచారం శ్రీనివాస్ రెడ్డి, షబ్బీర్ అలీ, శాసనమండలి సభ్యులు మహేష్ కుమార్ గౌడ్, జీవన్ రెడ్డి, శాసనసభ్యులు పైడి రాకేష్ రెడ్డి, వేముల ప్రశాంత్ రెడ్డి, భూపతిరెడ్డి, మున్సిపల్ నాయకులు అధికారులు తదితరులు పాల్గొంటున్నట్టు తెలిపారు.

లోక్‌అదాలత్‌లో రికార్డు స్థాయిలో 26,026 కేసులు పరిష్కారం

నవతెలంగాణ-కంఠేశ్వర్/ఆర్మూర్



ఆర్మూర్‌లో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి నసీం సుల్తాన

నిజామాబాద్ జిల్లాలో అన్ని కోర్టులలో శనివారం జాతీయ లోక్ అదాలత్ సంధర్బంగా మొత్తం 26,026 కేసులు పరిష్కరించినట్టు జిల్లా న్యాయమూర్తి సునిత కుంచాల తెలిపారు. జిల్లా కోర్టు కాంప్లెక్స్‌తో పాటు బోధన్, ఆర్మూర్ కోర్టులలో 86 సివిల్ కేసులు, 15,666 క్రిమినల్ కేసులు, 10,234 ప్రి లిటిగేషన్ కేసులు పరిష్కరించినట్లు జిల్లా జడ్జీ తెలిపారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థతో పాటు జిల్లా అధికార యంత్రాంగం, పోలీస్ శాఖలతో సమన్వం చేసి జిల్లాలో జాతీయ లోక్ ఆదాలత్‌ను సక్సెస్ చేసినట్లు తెలిపారు. కాగా ఆర్మూర్ కోర్టులో సీనియర్ సివిల్ జడ్జి నసింసుల్తాన అధ్వర్యంలో పలు కేసులను పరిష్కరించారు. పంతాలకు పోకుండా రాజీమార్గం ఎంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ పీపీ ఖాందేశ్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు తెడ్డు నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టి నినాదాలు చేస్తున్న కార్మికులు, సీఐటీయూ నాయకులు

ఉద్యోగ భద్రత కల్పించాలి

- కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్, నాన్ పర్మినెంట్ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలి
- సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నూర్జహాన్ డిమాండ్.. కలెక్టరేట్ ఎదుట ధర్నా

నవతెలంగాణ-కంఠేశ్వర్

కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ వర్కర్స్ నాన్ పర్మినెంట్ కార్మికులు ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని కనీస వేతనాలు పెంచాలని కార్మిక చట్టాలను అమలు చేయాలని సీఐటీయూ జిల్లా జిల్లా ప్రధాన కార్యదర్శి నూర్జహాన్ డిమాండ్ చేశారు. శనివారం కలెక్టర్ కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్బంగా సిఐటియు జిల్లా కార్యదర్శి నూర్జహాన్ మాట్లాడుతూ... రాష్ట్రంలోని ప్రైవేట్ పరిశ్రమలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వరంగ సంస్థలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ వర్కర్స్, నాన్ పర్మినెంట్, రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు, శాఖల్లోని కాంట్రాక్ట్-ఔట్సోర్సింగ్, యూనివర్సిటీ నాన్ టీచింగ్, మున్సిపల్, గ్రామ పంచాయితీ తదితర స్థానిక సంస్థలు, వైద్య ఆరోగ్య రంగం, విద్యుత్ రంగం, సింగరేణి, ఆర్టీసి తదితర రంగాల కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, కనీస వేతనాలు పెంచాలని, కార్మిక చట్టాలు అమలు చేయాలని, 1979 వలస కార్మిక చట్టం పటిష్ఠంగా అమలుపర్చాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పారిశ్రామికవేత్తలకు రాయితీలు ఇస్తున్నాయి కానీ కార్మికులకు కనీస వేతనాలు పెంచడం లేదని అన్నారు. 1979 అంతర్రాష్ట్ర వలన కార్మిక చట్టం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్, నాన్ పర్మినెంట్ కార్మికులు, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గణేష్ సందీప్ కార్తీక్ పవన్ బుచ్చన్న అజయ్ సునీల్ నరేష్ అల్కానంద నవనీత నీలావతి గంగాధర్ పద్మ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో తాత్సారం తగదు

- పకడ్బందీగా పర్యవేక్షించి సకాలంలో పూర్తి చేయించాలి
- 'దిశా' సమావేశంలో ఎం.పీ ధర్మపురి అర్వింద్
- ప్రొటోకాల్ పాటించడం లేదు : అర్బన్, ఆర్మూర్ ఎమ్మెల్యేలు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ



దిశ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ అరవింద్

ప్రజలకు ఉపయుక్తంగా నిలిచే అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయించేందుకు అధికారులు పకడ్బందీ పర్యవేక్షణ జరపాలని నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు ధర్మపురి అర్వింద్ సూచించారు. సమీకృత జిల్లా కార్యాల యాల సముదాయం సమావేశ మందిరంలో శనివారం ఎంపీ అర్వింద్ అధ్యక్షతన జిల్లా అభి వృద్ధి సమన్వయ, మానిటరింగ్(దిశ) కమిటీ సమావేశం నిర్వహించారు. నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు తదితరులు పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో వివిధ శాఖల ద్వారా చేపడు తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల ప్రగతిపై ఎజెండా అంశాల వారీగా సమావేశంలో చర్చించారు.

ఈ సందర్బంగా ఎంపీ మాట్లాడుతూ, ఆయా ప్రాంతాల్లో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో ఎనలేని తాత్సారం జరుగుతోందని అన్నారు. మాక్లూర్ మండలం అడవి మామిడిపల్లి వద్ద రోడ్డు నిర్మాణంతో పాటు ఆయా చోట్ల రహదారుల నిర్మాణ పనులు మందకొడిగా సాగుతున్నాయని అన్నారు. ఈ పెండింగ్ పనుల విషయమై చర్చించేందుకు అక్టోబర్ రెండవ వారంలో ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. సంబంధిత శాఖల అధికారులందరూ ఈ సమావేశానికి హాజరయ్యేలా చూడాలన్నారు. సకాలంలో పనులు పూర్తయి ప్రజలకు వసతులు అందుబాటులోకి వచ్చేలా అధికారులు చొరవ చూపాలని హితవు పలికారు. వివిధ పథకాల కింద కేంద్ర ప్రభుత్వం ద్వారా మంజూరైన ఆయా పనులు ఏ దశల్లో కొనసాగుతున్నాయి, వెచ్చించిన నిధుల వివరాలను తెలుపుతూ సమగ్ర నివేదికలు తనకు సమర్పించాలని ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్, జాతీయ రహదా రులు, ఫారెస్ట్ తదితర శాఖల అధికారులను ఆదేశించారు. విద్యాశాఖకు సంబంధించి కేంద్రం ద్వారా మంజూరైన నిధుల గురించి ఎం.పీ ప్రశ్నించగా, పీఎంశ్రీ పథకం కింద జిల్లాలో 40 పాఠశాలలకు కేంద్రం ద్వారా రూ. 20 కోట్ల నిధులు మంజూరయ్యాయని, వాటిని అదనపు తరగతి గదుల నిర్మాణాలు, లైబ్రరీలు, ప్రయోగశాలలు, క్రీడా పరికరాలు, మైదానాల అభివృద్ధి కోసం వెచ్చిస్తున్నామని డీఈఓ దుర్గాప్రసాద్ తెలిపారు. అదేవిధంగా అమృత్ పథకం కింద జిల్లాలోని నిజామాబాద్ నగర పాలక సంస్థతో పాటు బోధన్, ఆర్మూర్, భీంగల్ మున్సిపాలిటీలకు రూ. 335 కోట్ల నిధులు మంజూరయ్యాయని ప్రజారోగ్య శాఖ ఈ.ఈ తిరుపతికుమార్ ఎం.పీ దృష్టికి తెచ్చారు. ఈ నిధులతో తాగునీటి సరఫరా వ్యవస్థను మరింతగా మెరుగుపరుస్తున్నామని, భూగర్భ డ్రైనేజీ పెండింగ్ పనుల పూర్తికి కూడా అమృత్ పథకం నిధులను వెచ్చిస్తున్నామని అన్నారు. అటవీ శాఖకు 'కాంపా' పథకం ద్వారా మంజూరైన నిధులను సక్రమంగా వెచ్చిస్తూ పచ్చదనాన్ని పెంపొందించేందుకు చిత్తశుద్ధితో కృషి చేయాలని ఎం.పీ అర్వింద్ ఫారెస్ట్ అధికారులకు సూచించారు.

పీ.ఎం విశ్వకర్మ పథకం అమలు తీరు గురించి ఎం.పీ ఆరా తీయగా, జిల్లాలో 23583 మంది దరఖాస్తులు చేసుకున్నారని, నల్గొండ తరువాత నిజామాబాద్ జిల్లా రాష్ట్రంలో రెండవ స్థానంలో ఉందని పరిశ్రమల శాఖ జిల్లా మేనేజర్ సురేష్ కుమార్ తెలిపారు. ఇప్పటివరకు 2592 మందికి శిక్షణ కూడా పూర్తి చేశామని వివరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ అంకిత్, నగరపాలక సంస్థ కమిషనర్ మకరంద్, డీఆర్డీఓ సాయాగౌడ్, వివిధ శాఖల అధికారులు, దిశా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రొటోకాల్ పాటించడం లేదు : ఎమ్మెల్యేలు



కాగా, అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి ప్రొటోకాల్ పాటించడం లేదని ఎమ్మెల్యేలు ధన్పాల్ సూర్యనారాయణ, పైడి రాకేష్ రెడ్డి సమావేశంలో ఆక్షేపణ తెలిపారు. దీనిపై ఎం.పీ స్పందిస్తూ, ప్రొటోకాల్ ఉల్లంఘన జరుగకుండా అధికారులు సంబంధిత ఎం.పీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులకు తప్పనిసరి ముందస్తుగానే తగిన సమాచారం అందించాలని అన్నారు. ప్రజాప్రతినిధుల గౌరవానికి భంగం కలిగించేలా ప్రవర్తిస్తే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు.

ఆర్ అండ్ బీ చీఫ్ ఇంజనీర్‌కు సన్మానం



కాగా, రోడ్లు భవనాల శాఖ చీఫ్ ఇంజనీర్ హన్మంత్ రావు పదవీ విరమణ చేస్తున్న సందర్భాన్ని పురస్కరించుకుని దిశా సమావేశం ముగిసిన అనంతరం ఎం.పీ అర్వింద్, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు ఆయనను ఘనంగా సన్మానించారు. సుమారు 38 సంవత్సరాల పాటు హన్మంత్ రావు అందించిన సేవలను కొనియాడారు. సుదీర్ఘ కాలంపాటు విధులు నిర్వర్తించిన సందర్భంగా ఎదురైన అనుభవాలను హన్మంత్ రావు ఈ వేదికగా పంచుకున్నారు.

త్రిబుల్ ఐటీలో సీట్లు సాధించేలా విద్యార్థులను తీర్చాలి : కలెక్టర్



కేజీబీవీని సందర్శించి సూచనలిస్తున్న కలెక్టర్

నవతెలంగాణ-భిక్కనూర్/కామారెడ్డి

ట్రిపుల్ ఐటీలో సీటు సాధించే దిశగా విద్యార్థులకు విద్యా బోధన చేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. శనివారం మండలంలోని జంగంపల్లి శివారులో ఉన్న కే.జి.బి.వి. పాఠశాలను కలెక్టర్ తనిఖీ చేశారు. విద్యార్థులకు అందుతున్న భోజన, వసతి సౌకర్యాలు, విద్యా బోధన తదితర అంశాలకు సంబంధించిన వివరాలను ప్రత్యేక అధికారిణి హరిప్రియ ను అడిగి తెలుసుకున్నారు. వంటశాల,స్టోర్ రూం లను పరిశీలించి విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని అన్నారు. ఎప్పటికప్పుడు సరుకులను పరిశీలించాలని సూచించారు. స్టాక్ రిజిస్టర్, హాజరు రిజిస్టర్ లను పరిశీలించారు. తరగతి గదులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ రంగనాథ్ రావు, జిల్లా ఎస్సీ సంక్షేమ అధికారిని రజిత, జిల్లా విద్యాశాఖ అధికారి రాజు, జిల్లా పరిషత్ సి.ఈ. ఒ.చందర్ నాయక్, పంచాయతీ రాజ్ ఈ ఈ దుర్గ ప్రసాద్, డిప్యూటీ ఈ ఈ స్వామి దాస్, జిల్లా పశు సంవర్ధక అధికారి రాజేశ్వర్, ఇన్చార్జ్ ఎంపీడీవో రాజు కిరణ్ రెడ్డి, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం చేసి మరొకరి ప్రాణాన్ని కాపాడండి

కామారెడ్డి : రక్తదానం చేసి మరొకరి ప్రాణాన్ని కాపాడండి అని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. శనివారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో స్వచ్ఛంద రక్త దాన శిబిరాన్ని కలెక్టర్ ప్రారంభించి మాట్లాడారు. ఇలాంటి శిబిరాలు మరిన్ని నిర్వహించాలని, అత్యవసర సమయంలో రక్తం అందుబాటులో ఉంచాలని అన్నారు. డి.ఆర్. డి. ఎ. ఆధ్వర్యంలో 35 మంది నుండి రక్తాన్ని సేకరించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, సి. పి. ఒ. రాజారాం, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ రావు, ఐకెపి డిపిఎం సుధాకర్, రెడ్ క్రాస్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఇలా అయితే అంటువ్యాధులు రావా...?

- గురుకుల పాఠశాల తీరుపై సబ్ కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి

నవతెలంగాణ-నసురుల్లాబాద్



ఆగ్రహం వ్యక్తం చేస్తున్న అడిషనల్ కలెక్టర్

'గురుకుల పాఠశాలలో అపరిశుభ్ర వాతావరణం నెలకొంది. ఇలా అయితే అం టువ్యాధులు రావా..? అంటూ బాన్సువాడ సబ్ కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి ప్రశ్నించారు. శనివారం బీర్కూర్ మండలం లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల రికార్డులను పరిశీలిస్తూ సమస్యలను వివరాలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల గదికి వెళ్లి విద్యార్థులతో ముచ్చటించారు. విద్యా బోధన పనితీరుపై విద్యార్థులకు అడిగి తెలుసుకున్నారు. అనంతరం బీర్కూర్ మహాత్మా గాంధీ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలను ఆకస్మికంగా బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి తనిఖీ చేశారు. గురుకుల పాఠశాల ప్రాంగణంతో పాటు, వంటశాల భోజన శాల పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలపై అడిగి తెలుసుకున్నారు. మరుగుదొడ్లు అపరిశుభ్రంగా ఉండటంపై అసహనం వ్యక్తం చేశారు. తదనంతరం విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించారు. పాఠశాలలో అపరిశుభ్రత లేకుండా చూడాలని మరోసారి ఇలా జరగకుండా చూడాలని ప్రిన్సిపల్ కు ఆదేశించారు. వీరి వెంట మండల విద్యాధికారి వెంకన్న, అధికారులు తదితరులు ఉన్నారు.

జీవో 25 సవరించే ఉపాధ్యాయుల సర్దుబాటు చేయాలి

- బదిలీ అయిన వారు రిలీవ్ తర్వాతే కేటాయింపులుండాలి
- ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో నిరసన

నవతెలంగాణ-కంఠేశ్వర్



కలెక్టరేట్ ఎదుట నిరసన చేపట్టిన యూఎస్‌పీసీ ప్రతినిధులు

జీవో నంబర్ 25ను సవరించిన తర్వాతనే ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలని, బదిలీ అయిన ఉపాధ్యాయులను రిలీవ్ చేసిన తర్వాతే నూతన పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను బట్టి ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ప్రతినిధులు డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్త కార్యక్రమంలో భాగంగా శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద సాయంత్రం నిరసన ప్రదర్శన చేపట్టారు. అనంతరం కలెక్టర్ కార్యాలయం ఏవో ప్రశాంత్‌కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్బంగా స్టీరింగ్ కమిటీ నాయకులు మాట్లాడుతూ బదిలీలు, పదోన్న తుల అప్పీళ్లను సానుకూలంగా పరిష్కరించాలని, ప్రతి ప్రాథమిక పాఠశాలకు ఒక ప్రధానోపా ధ్యాయులు ఉండాలని, ప్రతి ప్రాథమిక పాఠశాలలో కనీసం ఇద్దరు ఉపాధ్యాయులు ఉండాలే చూడాలని కోరారు. తరగతికి ఒక టీచర్ ఉండాలని, ఉన్నత పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియం, తెలుగు మీడియం లకు వేరువేరుగా పూర్తి స్థాయి ఉపాధ్యాయులు ఉండాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్‌పీసీ) నిజామాబాద్ జిల్లా స్టీరింగ్ కమిటీ నాయకులు డి. సత్యానంద్, సల్ల సత్యనారాయణ, పి.శాంతన్, వై. విజయ్ కుమార్, కె.ఒమాజీ, సుధాం, ఆర్. పెంటన్న, జి.గంగాధర్, కే సి లింగం, ఎస్‌జిటియు జిల్లా నాయకులు ఎమ్. వెంకటరమణ, ఏ. గంగప్రసాద్, యూఎస్పిసి సంఘాల ప్రతినిధులు, విజయ్ కుమార్, దాస్, కిషన్, చంద్రశేఖర్, ఇబ్రహీం, గంగాధర్, శ్రీనివాస్, లింగన్న, జనార్దన్, ఆనంద్, బాలకిషన్, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

సేఫ్టీ కిట్లతో గీత కార్మికులకు రక్షణ

- వినియోగంపై శిక్షణ కల్పించిన ఎక్సైజ్ అధికారులు
- అర్హులందరికీ ఇవ్వాలి : కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర సలహాదారులు జిల్లా సీనియర్ నాయకులు పెద్ది వెంకట్రాములు

నవతెలంగాణ-మోర్తాడ్/నిజామాబాద్‌సిటీ/కంఠేశ్వర్



మోర్తాడ్ మండలం ధర్మోరలో అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ అధికారులు

సేఫ్టీ మోగుల కిట్లతో గీత కార్మికులకు రక్షణ ఉంటుందని, ప్రమాదాల బారిన పడకుండా ఉంటా రని ఎక్సైజ్ అధికారులు తెలిపారు. శనివారం నిజామాబాద్, భీంగల్ సర్కిల్‌లోని పలు మండలాల్లో సేఫ్టీ కిట్‌ల వినియోగంపై అవగాహన కల్పించారు. కాగా గీత కార్మికుల్లో అర్హులందరికీ కిట్లను అందించాలని కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర సలహాదారులు జిల్లా సీనియర్ నాయకులు పెద్ది వెంకట్రాములు కోరారు.

గీత వృత్తిలో పెరుగుతున్న ప్రమాదాలు, మరణాలు, వికలాంగులుతున్న గీత కార్మికుల సంఖ్య రోజురోజుకు పెరిగి తమ వృత్తికి తామే భవిష్యత్తు తరాలను దూరం చేసుకుంటున్నటువంటి ప్రమాద పరిస్తితులు దాపురించాయి. దీనిని గమనించిన తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం పెద్ద ఎత్తున రాష్ట్రవ్యాప్తంగా సమరశీల పోరాటాలు చేసి, పలు సూచనలు చేసింది. ఈ పోరాటాలని గమనించిన పరిగణలోకి తీసుకున్న ప్రభుత్వం ఐఐటి శాస్త్రవేత్తల ద్వారా సేఫ్టీ మోగుల కిట్టును తయారు చేయించింది. దానికి కాటమయ్య రక్షణ (కిట్టు) కవచాలుగా నామకరణం చేసింది. ప్రధాన బాధ్యత తెలంగాణ కలుగత కార్మిక సంఘం తీసుకొని రాష్ట్రవ్యాప్తంగా విస్తృత ప్రచారం చేసింది. శిక్షణలో నిష్ణాతులైన వారితో గీత కార్మిక వృత్తిలో కొనసాగుతున్న వాళ్లందరికీ శిక్షణ ఇస్తున్నది. అందులో భాగంగా శనివారం నిజామాబాద్ జిల్లా, కొత్తపేట గ్రామంలో ఉన్న గీత కార్మికులకు, చుట్టుముట్టు ఎక్సైజ్ సర్కిల్స్ అయినా నిజామాబాద్ సర్కిల్, భీమ్గల్ సర్కిల్‌లోని మోర్తాడ్ మండల కేంద్రంలో గీత కార్మికులకు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమం బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇప్పటికే కొంతమందిని గుర్తించిన ఎక్సైజ్ డిపార్ట్మెంట్ బీసీ సంక్షేమ శాఖకు వివరాలు ఇచ్చారు. అలాగే తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం నిజామాబాద్ జిల్లా కమిటీ పాల్గొన్నది. ఈ కార్యక్రమంలో వెనకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఇన్చార్జి ఇడి రమేష్ , ఆ శాఖ సీనియర్ అసిస్టెంట్ జయలలిత, పుష్పలత, నరసయ్య, స్వామి అలాగే ఎక్సైజ్ రూరల్ ఎస్సై మల్లేష్, ఎక్సైజ్ కానిస్టేబుల్స్, శిక్షకులు జస్వంత్, తిరుపతి గౌడ్, అంజయ్య, తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర సలహాదారులు జిల్లా సీనియర్ నాయకులు పెద్ది వెంకట్రాములు, నాయకులు శేఖర్ గౌడ్, కామారెడ్డి నాయకులు బిడిగల యాదగిరి గౌడ్, దంతూరి నర్సింలు గౌడ్లు ఆతిథ్యం ఇచ్చిన కొత్తపేట గౌడ గీత కార్మికులు.. ఎస్ లక్ష్మీనారా గౌడ్, శ్రీనివాస్ గౌడ్, సాయిబాబాగౌడ్, మల్లేష్ గౌడ్, నరస గౌడ్ మరియు భీమ్ గల్ సర్కిల్ గీత కార్మికులు పాల్గొన్నారు. మోర్తాడ్ మండలం ధర్మోర గ్రామంలో ఎక్సైజ్ ఎస్సై మానస ఆధ్వర్యంలో సేఫ్టీ కిట్ల వినియోగంపై గీత కార్మికులకు అవగాహన కల్పించారు. నాయకులు పెద్ది వెంకట రాములు మాట్లాడుతూ జిల్లాలో కిట్లు దుర్వినియోగం కాకుండా చర్యలు తీసుకొని అర్హులైన వారికే అందజేయాలని కోరారు.



కొత్తపేట్‌లో..

భగత్‌సింగ్ పోరాట స్ఫూర్తిని యువత ఆదర్శంగా తీసుకోవాలి

- ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో భగత్ సింగ్ జయంతి వేడుకలు



నివాళి అర్పిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

నవతెలంగాణ-కామారెడ్డి

నేటి తరం యువత, విద్యార్థులు భగత్ సింగ్ పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకొని ముందుకు నడవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ముదాం అరుణ్ అన్నారు. జిల్లా కేంద్రంలో భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో భగత్ సింగ్ 117వ జయంతి నిర్వహించారు. దేశ స్వాతంత్రం కోసం తన చిన్న వయసులోనే ప్రాణాలు అర్పించిన గొప్ప వ్యక్తి భగత్ సింగ్ అని అన్నారు. బ్రిటిష్ పార్లమెంట్ మీద పొగ బాంబులు వేసి బ్రిటిష్ వారిని గడగడలాడించిన మహావీరుడు భగత్ సింగ్ అని పేర్కొన్నారు. నేటితరం యువత, విద్యార్థులు ఆయన పోరాట స్ఫూర్తిని ముందు తీసుకొని నడవాలని పిలిపునిచారు. కేంద్ర ప్రభుత్వం భగత్ సింగ్ కి భారతరత్న అవార్డును ప్రకటించి, పాఠ్యపుస్తకాల్లో భగత్ సింగ్ జీవిత చరిత్రను ముద్రించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు నవీన్, భాను, సాయి, రాహుల్, ప్రసాద్, నితిన్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా చైతన్యానికి ప్రతీక.. ఐలమ్మ

- విగ్రహం ఆవిష్కరించిన జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీ కాంతారావు

నవతెలంగాణ-నిజాంసాగర్/పిట్లం



చిట్యాల ఐలమ్మ విగ్రహం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

చిట్యాల ఐలమ్మ మహిళా చైతన్యానికి ప్రతీక అని ఎమ్మెల్యే తోట లక్ష్మి కాంతారావు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని మార్కెట్ యార్డ్ లో తెలంగాణ వీరనారి చిట్యాల ఐలమ్మ 129వ జయంతి సందర్భంగా రజక సంక్షేమ సంఘం ఆధ్వర్యం లో ఏర్పాటు చేసిన చాకలి ఐలమ్మ విగ్రహ ఆవిష్కరణ చేపట్టారు. తెలంగాణ సాయుధ పోరాటంలో బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం అలుపెరగని పోరాటం చేసిన ఐలమ్మ మహిళా చైతన్యానికి ప్రతీక అని అన్నారు. పీడిత ప్రజల కోసం ఎనలేని పోరాటం చేసిన మహిళ ఐలమ్మ అని, ఆమె త్యాగం ఎంతో గొప్పదని ఆయన కొనియాడారు. రజాకార్ల ఆగడాలపై తెగించి పోరాడిన ఐలమ్మను స్ఫూర్తిగా తీసుకొని హక్కులను సాధించుకోవాలని ఆయన సూచించారు. బడుగు బలహీన వర్గాల కోసం ఐలమ్మ చేసిన పోరాటం ఎనలేనిదని ఆయన కొనియాడారు. కార్యక్రమంలో ఉమ్మడి మండలాల కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మల్లికార్జున్, రవీందర్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి జయ ప్రదీప్, నాయకులు ప్రజాపండరి, ఆకాష్ తదితరులు పాల్గొన్నారు.

నీటి సమస్య రాకుండా బాధ్యత వహిస్తా

పిట్లం : విద్యార్థినిలకు నీటి సమస్య రాకుండా బాధ్యత వహిస్తానని ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు అన్నారు. శనివారం పిట్లం మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాల లో 2 కోట్ల 30 లక్షలతో నిర్మించనున్న అదనపు భవన నిర్మాణ పనులకు ఎంపీ సురేష్ షెట్కార్ తో కలిసి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో నాయకులు రామ్‌రెడ్డి, హన్మాండ్లు , మోహన్ రెడ్డి , కృష్ణారెడ్డి, మురళీధర్ గౌడ్, బొడ్ల రాజు, చిప్ప శివ, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కుక్కలకు రేబిస్ వ్యాక్సిన్

నవతెలంగాణ-రెంజల్

మండల కేంద్రంలోని పశువుల ఆసుపత్రి ఆవరణలో జిల్లా అధికారుల ఆదేశాల మేరకు రేబిస్ వ్యాక్సిన్‌ను ఊర, పెంపుడు కుక్కలకు వేసినట్టు వెటర్నరీ అధికారి తెలిపారు. కార్యక్రమంలో జూనియర్ వెటర్నరీ అధికారులు నాగరత్నం, గంగరాజు, సిబ్బంది నరేష్, అటెండర్ తదితరులు పాల్గొన్నారు.


వ్యాక్సిన్ వేస్తున్న వెటర్నరీ అధికారులు

డ్రగ్స్‌పై విద్యార్థులకు అవగాహన

నవతెలంగాణ-బోధన్

డ్రగ్స్‌కు అలవాటుపడితే విద్యార్థుల జీవితాలు ఎంత దీనంగా మారతాయో తెలుపుతూ వాటి ప్రభావంపై పోలీస్ శాఖ ఆధ్వర్యంలో శనివారం బోధన్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కళాజాతతో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పట్టణ సీఐ వెంకటనారాయణ మాట్లాడుతూ.. విద్యార్థులు చెడు స్నేహాల వలన డ్రగ్స్ లాంటి మత్తు పదార్థాలకు బానిస జీవితాలను అంధకారం చేసుకుంటున్నారని అన్నారు. భావి పౌరులుగా ఎదిగి ఉన్నత లక్ష్యాలతో ఎదిగే మీ జీవితాలను చెడు వ్యసనాలకు చేసుకోవద్దని సూచించారు. అలాగే ట్రాఫిక్ రూల్స్‌ను విధిగా పాటించాలని సూచించారు. తప్పనిసరిగా హెల్మెట్ ధరించి వాహనం నడపాలని సూచించారు.



అవగాహన కల్పిస్తున్న సీఐ

గుండెను కాపాడుకుందాం

- నిరంతరం పనిచేసే కీలక అవయవం
- వ్యాయామం, జాగ్రత్తలు తీసుకోవాలి
- మనోరమ హాస్పిటల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ రాజేంద్ర శ్రీకాంత్

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిరంతరం పనిచేసే కీలక అవయవం గుండె అని.. దానిని కాపాడుకుందామని మనోరమ హాస్పిటల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ రాజేంద్ర శ్రీకాంత్ తెలిపారు. నేడు ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా నవతెలంగాణతో ఆయన ప్రత్యేకంగా మాట్లాడారు.

మనకు బాగా తెలిసిన వాటినే మనం ప్రేమించి, వాటిని బాగా రక్షించుకుంటాం. అలాంటిది గుండెను కాపాడుకోవడానికి సైతం జీవితంలో కొన్ని ప్రాథమిక సూత్రాలు పాటిస్తూ, క్రమశిక్షణగా ఉండాలి. రోజురోజుకు మన జీవనశైలి మారిపోతోంది. ఉద్యోగాల తీరు సైతం మారుతోంది. ఐటీ రంగం లాంటి చోట్ల మన ఆహారపు అలవాట్లు కూడా మారుతున్నాయి. సరైన సమయానికి, సరైన ఆహారం తీసుకోవట్లేదు. కొలెస్ట్రాల్ ఎక్కువగా ఉండే ఆహారం, అధిక టీపి, జంక్ ఫుడ్ తీసుకోవడం మానేస్తేనే ఆరోగ్యకరమైన సుదీర్ఘ జీవనం దొరుకుతుంది.

వ్యాయామం చేయాలి..



మనుషులందరూ చక్కగా నడవగలరు. పరుగులు తీయక్కర్లేదు గానీ, కనీసం రోజూ కొంత దూరం నడవండి. రోజుకు 20 నిమిషాలు నడిస్తే గుండెకవాటాలకు బోలెడంత ప్రయోజనం ఉంటుందని రుజువైంది.

ఒత్తిడిని నివారించాలి..

ఈ రోజుల్లో ఒత్తిడి లేని మనిషిని చూడటం అసాధ్యం. అయితే దాన్ని ఎలా తగ్గించుకోవాలనేది మాత్రమే మనం చూడాలి. ఇంటిని సంతోషంగా ఉంచుకోండి. ఆర్థిక వ్యవహారాలు సరిగా నిర్వహించుకోండి. పని వాతావరణం బాగుండేలా చూసుకోండి. రోజూ వ్యాయామం చేయండి. వీటన్నింటితో ఒత్తిడి బాగా తగ్గుతుంది.

మరిన్ని సూచనలు..

యువతలో గుండె జబ్బులు రావడానికి ధూమపానం ప్రధాన కారణం. మెరుగైన రేపటి కోసం, ఈరోజే ధూమపానం మానేయండి.


మాట్లాడుతున్న డాక్టర్ రాజేంద్ర శ్రీకాంత్

రక్తపోటును ప్రతి మూడు నెలలకు ఒకసారి పరీక్షించుకోండి. రక్తపోటు పెరగకూడదంటే.. ఉప్పు వాడకం తగ్గించండి. కుటుంబంలో వారసత్వ లక్షణాలు బాగా ఉంటుంటే, ఈరోజే పరీక్షలు చేయించుకోండి. భారతదేశం మధుమేహానికి రాజధాని. మన దేశంలో చాలావరకు గుండె వ్యాధులకు, వాటివల్ల మరణాలకు మధుమేహమే ప్రత్యక్ష కారణం. మధుమేహం త్వరగా రాకుండా ఉండాలన్నా, దాని దుష్ప్రభావాల నుంచి బయటపడాలన్నా రోజూ వ్యాయామం తప్పనిసరిగా చేసుకోవాలి.

యుక్త వయసులో గుండెజబ్బు

- ప్రతిఒక్కరూ తమ ఆహారపు అలవాట్లను మార్చుకోవాలి
- ఫ్రూడెన్స్ హాస్పిటల్ కార్డియాలజిస్ట్ గౌతంరెడ్డి ఆకిడి

నవతెలంగాణ-కంఠేశ్వర్

దేశవ్యాప్తంగా ప్రతి ఒక్కరూ తమ తమ అలవాట్లను మార్చుకోవడం వల్లనే ఎక్కువగా గుండె జబ్బుల బారిన పడుతున్నారని ఫ్రూడెన్స్ హాస్పిటల్ కార్డియాలజిస్ట్ గౌతంరెడ్డి ఆకిడి తెలిపారు. నేడు వరల్డ్ హార్ట్ డే సందర్భంగా ఆయన నవతెలంగాణతో మాట్లాడారు.

నిజామాబాద్ జిల్లాలో ప్రధానంగా యువత చెడు అలవాట్లకు అలవాటై తమ గుండెకు భారం పెడుతూ గుండె నొప్పి రావడం సడన్ హార్ట్ స్ట్రోక్ రావడంతో మరణాలు పెరుగుతున్నాయి. అందుకు ప్రజలు పలు పద్ధతులను పాటించాలి. రక్తంలో గ్లూకోజు స్థాయిలు తెలుకోవాలి. ఇది ఉండాల్సిన స్థాయికంటే ఎక్కువగా ఉండటాన్ని మధుమేహం అంటారు. మధుమేహ బాధితుల్లో 60 శాతం మరణాలకు గుండెజబ్బులే కారణమవుతున్నాయి. కాబట్టి మధుమేహం ఉన్నవాళ్లు దానిని కచ్చితంగా నియంత్రణలో ఉంచుకోవాలి. అలాగే మిగతావాళ్లు కూడా దాని బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. అప్పుడప్పుడూ రక్తపరీక్ష చేయించుకోవాలి. రక్తంలో గ్లూకోజు స్థాయిలు ఎక్కువగా ఉంటున్నాయేమో, తమకు మధుమేహం వచ్చిందేమో తెలుసుకోవటం ఈరోజుల్లో చాలా అవసరం. రక్తపోటు చూసుకోండి.

రక్త పోటు ఎప్పటికప్పుడు చూసుకోవాలి..

అధిక రక్తపోటు (హైబీపీ) అనేది గుండెపోటు, గుండెజబ్బులకు కారణం అవుతోంది. వాస్తవానికి ఎవరికైనా బీపీ ఉండాల్సిన దానికంటే ఎక్కువగా ఉన్నా పైకి ఎటువంటి లక్షణాలు, సమస్యలు, బాధలు కనబడవు. దీనివల్ల చాలామంది తమకు హైబీపీ ఉందన్న సంగతి సరైన సమయంలో గుర్తించడంలేదు. కానీ లోపల్లోపల దానివల్ల జరిగే నష్టం జరిగిపోతూనే ఉంటోంది. అందుకే దీనిని సైలెంట్ కిల్లర్ అంటుంటారు.


మాట్లాడుతున్న డాక్టర్ గౌతంరెడ్డి ఆకిడి

కొలెస్ట్రాల్ బీఎంఐ చూసుకోవాలి..

చాలా మంది గుర్తించటం లేదు కానీ, రక్తంలో కొలెస్ట్రాల్ స్థాయి ఉండాల్సిన దానికంటే ఎక్కువ ఉండటం కూడా పెద్ద ముప్పే. దీనివల్ల రక్తనాళాలు పూడ్చుకుపోవడం అనే ఇబ్బందికరమైన పరిస్థితి ఏర్పడుతుంది. ఫలితంగా గుండెలో రక్తనాళాలు మూసుకుపోయి, రక్త సరఫరాకు ఆటంకం కలిగి గుండెపోటు వస్తుంది. మెదడులోని రక్తనాళాల్లో పూడికలు వచ్చి పక్షవాతంవంటి సమస్యలూ ముంచుకురావొచ్చు. ఇవేకాదు కొలెస్ట్రాల్ ఎక్కువుండటం వల్ల తలెత్తుతాయి.

గుండెకు బలం ఇవ్వాలి..

మనం తినే ప్రతిదీ మనకూ, మన గుండెకూ శక్తినిచ్చేదే. అయితే మనం ఒక్కశక్తినే చూసుకోకూడదు. మంచి ఆరోగ్యాన్ని కూడా ఇచ్చే ఆహారాన్ని తినటం, అలాంటి వాటినే ఎంచుకోవటం చాలా ముఖ్యం అనేది గుర్తుంచుకోండి.

గుండెను బాధ పెట్టకూడదు..

మన గుండె ఒక యంత్రంలా క్షణం తీరిక లేకుండా పనిచేస్తూనే ఉంటుంది. దానికి ఇబ్బందులు తెచ్చిపెట్టే పరిస్థితులను తీసుకురావద్దు.

గుండెకు పని చెప్పాలి..

నిత్యం శరీరానికి పని ఉండేలా చూసుకోవాలి. దీనివల్ల చురుకుగా ఆరోగ్యంగా ఉండగలుగుతారు. గుండె జబ్బుల ముప్పు తగ్గిపోతుంది. జీవితం కూడా రోజంతా ఉల్లాసంగా గడుస్తుంది.

గుండె జబ్బు నివారణకు ముందస్తు జాగ్రత్తలు..

చిన్న వయసులోనే గుండెపోటుకు గురైన వారసత్వ చరిత్ర ఉన్నవారు ఎప్పటికప్పుడు కొలెస్ట్రాల్ పరీక్షలు చేయించుకుంటూ కొలెస్ట్రాల్‌ను నియంత్రించుకోవాలి. కొలెస్ట్రాల్ పెరగడం అన్నది ఆ వ్యక్తి లావుగా ఉన్నాడా, సన్నగా ఉన్నడా అన్నది ముఖ్యంకాదు. లావుగా ఉన్నవారిలో కొలెస్ట్రాల్ నార్మల్‌గానే ఉండవచ్చు. సన్నగా ఉన్నవారిలో చాలా ఎక్కువగానూ ఉండవచ్చు. కాబట్టి కొలెస్ట్రాల్ శాతాన్ని లావు, సన్నను బట్టి అంచనా వేయకుండా టెస్టు చేయించుకుంటే తెలుస్తుంది. మెడికల్ టెస్టులో తేలాల్సిందే తప్ప శరీర బరువు ఆధారంగా మాత్రం కాదు. కాకపోతే లావుగా ఉన్నవారిలో కాస్త ఎక్కువ మందిలో ఈ సమస్య ఉండవచ్చు. కుటుంబ చరిత్ర ఉన్నవారు చిన్న వయసు నుంచే కొలెస్ట్రాల్ పరీక్షలు చేయించుకుంటూ జాగ్రత్త పడాలి. తీవ్రతను అనుసరించి ఆహార నియమాలు పాటించడంగాని, మందులు వేసుకోవడంగాని డాక్టర్ల సూచన మేరకు చేయాలి. దీనివల్ల కొలెస్ట్రాల్‌ను నియంత్రణలో ఉంచవచ్చు. అలాగే గుండెపోటు రావడానికి మధుమేహం ఒకప్రధాన కారణం. అందుకే ఈ సమస్య ఉన్నవారు వ్యాధిని పూర్తిగా నియంత్రణలో ఉంచుకోవడం తప్పనిసరి. రోజూ మందులు క్రమం తప్పకుండా వాడుతూ కనీసం మూడు నెలలకు ఒకసారి డాక్టర్‌ను సంప్రదిస్తూ ఉండటంవల్ల ఈ సమస్య నుంచి బయటపడటం సులువవుతుంది.

పైపు లీకేజీలపై మంచినీటి సహాయకులకు రెండోరోజు శిక్షణ


మాట్లాడుతున్న ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ ముని నాయక్

నవతెలంగాణ-రెంజల్

మండల పరిషత్ కార్యాలయంలో పైప్ లైన్ లీకేజీలపై ఎడపల్లి, రెంజల్ మండలాల మంచినీటి సహాయకులకు రెండవ రోజు శిక్షణను ఇచ్చినట్టు ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ ముని నాయక్ శనివారం పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాలలోని ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటి అందించడానికి లీకేజీలను గుర్తించి వాటిని ఏ విధంగా పైప్‌లైన్లను మరమ్మతులు చేపట్టాలనే అంశంపై శిక్షణను అందజేసినట్టు ఆయన వివరించారు. వాటర్‌మెన్‌లో ఎలాంటి నిర్లక్ష్యం చేయకుండా ప్రజలకు స్వచ్ఛమైన నీటిని అందించడానికి పైప్‌లైనుల మరమ్మతులు ఏ విధంగా బిగించాలనే అంశంపై రెండవ రోజు శిక్షణ ఇచ్చినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గబ్బర్ సింగ్, రిసోర్స్ పర్సన్ లక్ష్మీనారాయణ, గ్రిడ్ ఏఈఈ చంద్రకాంత్ శర్మ, రెంజల్, ఎడపల్లి వాటర్‌మెన్‌లు, మిషన్ భగీరథ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న బోధన్ రూరల్ సీఐకి సన్మానం

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని సాటాపూర్ గ్రామానికి చెందిన ఓబీసీ మండల అధ్యక్షులు లచ్చేవార్ నితీన్ బదిలీపై వెళ్లిన బోధన్ రూరల్ సిఐ కె.నరేష్, బోధన్ రూరల్ సీఐగా ప్రమోషన్‌పై వచ్చిన విజయబాబును శాలువా కప్పి పుష్పగుచ్ఛాలను అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు కురుమే సాయిలు, కంఠం గంగారాం, గోసం పెద్ద సాయిలు తదితరులున్నారు.

భగత్ సింగ్, గుర్రం జాషువా జయంతి

నవతెలంగాణ-సిరికొండ

దేశ భక్తిని నరనరానా రంగరించుకొని నూనూగు మీసాల ప్రాయంలోనే ఉరి కొయ్యలను ముద్దాడిన యుగ పురుషుడు భగత్ సింగ్ త్యాగనిరతి, వడగాల్పులు నాకవిత్వమైతే వెన్నెల నా కవిత్వమన్న కవి సామ్రాట్ గుర్రం జాషువ సాహిత్య రమణీయత చరిత్ర పుటల్లో చిరస్మరణీయమని స్కౌట్స్, గైడ్స్ రాష్ట్ర ప్రతినిధి కె.సాల్మన్ అన్నారు. భారత స్వాతంత్ర్య పోరాటయోధుడు, అసమాన దేశభక్తి కల్గిన విప్లవ వీరుడు షాహిద్ భగత్ సింగ్ 117వ జయంతి, నవయుగ కవి చక్రవర్తి, పద్మ భూషణ్ గుర్రం జాషువా 127వ జయంతిని సత్యశోధక్ పాఠశాలలో నిర్వహించారు. మొదటగా కె సాల్మన్ ప్రిన్సిపాల్ ఆర్.నర్సయ్యతో కలిసి భగత్ సింగ్, జాషువా చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సాల్మన్ మాట్లాడుతూ దేశాన్ని బానిస సంకెళ్ళ నుంచి విముక్తి చేసేందుకు ఉప్పెనలాగా ఎగసిపడి భారతీయుల గుండెళ్ళో స్వతంత్ర సమరభేరి కాంక్షను చిగురించేలా చేసి దేశభక్తి, జాతీయతలకు చిహ్నంగా నిలిచిన భగత్ సింగ్ శౌర్యం శ్లాఘనీయమన్నారు. ఆధునిక తెలుగు కవుల్లో ప్రముఖ స్థానం పొంది, కవిత్వాన్ని ఆయుధంగా మలుచుకొని, సామాజిక రుగ్మతలపై మానవతా దృక్పథంతో స్పందిస్తూ, పుట్టుక కాదు జ్ఞానం మూలమని విశ్వసించి, విశ్వమానవా సమానత్వం కోసం గర్జించిన మహాకవి జాషువా అని కొనియాడారు. దేశభక్తికి, సామాజిక చైతన్యానికి మహనీయులు చేసిన కృషిని నేటి యువత ఆదర్శంగా తీసుకొవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న సత్యశోధక్ పాఠశాల బృంధం

పోలింగ్ కేంద్రాలు పరిశీలించిన తహసీల్దార్

నవతెలంగాణ-రెంజల్

జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని రెండు, ఆపైన ఒకే చోట ఉన్న పోలింగ్ కేంద్రాలను పరిశీలించి వాటిని మరోచోటకు మార్చాలని ఆదేశాలు రావడంతో శనివారం తహసీల్దార్ శ్రావణ్ కుమార్ మండలంలోని నీల, కందకుర్తి, దూపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సందర్శించారు. పాత పోలింగ్ కేంద్రాలలో మార్పు చేయడానికి వీలులేనందున ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్‌కు నివేదికను పంపినట్టు ఆయన పేర్కొన్నారు. ఆయన వెంట బిఎల్‌వోలు రాజశ్రీ, గంగా జమున, బాలహంస, నజ్మా సుల్తానా, శారద, రెవెన్యూ సిబ్బంది గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రావణ్ కుమార్

బాధిత కుటుంబానికి సిఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత


సిఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

మండలంలోని కమలాపూర్ గ్రామానికి చెందిన కొట్టాల శ్రీనివాస్‌కు సిఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరైన రూ.60వేల చెక్కును బాధితుడు కొట్టాల శీనుకు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పొలాసాని శ్రీనివాస్ శనివారం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ సీఎంఆర్ఎఫ్ చెక్కులతో నిరుపేద కుటుంబాలు తమ ప్రాణాలను రక్షించుకుంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిసిఎంఎస్ డైరెక్టర్ న్యాస రాజేశ్వర్, పెద్దోళ్ల శ్రీనివాస్, శ్రీనివాస్ గౌడ్, ఆశ రెడ్డి, గోపాల్, భూపతి తదితరులు పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి


క్రీడోత్సవాలలో పాల్గొన్న విద్యార్థులు

నవతెలంగాణ-సిరికొండ

విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని ఎంపీడీవో మనోహర్ రెడ్డి, ఎమ్మార్వో రవీంద్రరావు అన్నారు. శనివారం 68వ సిరికొండ మండల అంతర్ ఎస్‌జిఎఫ్ క్రీడోత్సవాలను ప్రతిభ హైస్కూల్లో జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. మొదట మార్చ్ ఫస్ట్‌తో గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం ఎంపీడీవో మాట్లాడుతూ.. మానసిక ఉల్లాసానికి, ఆరోగ్యకరమైన జీవితానికి ఉన్నతంగా తమ భవిష్యత్తును తీర్చిదిద్దుకోవడానికి క్రీడలు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని వాటన్నింటినీ సమానంగా తీసుకోవాలని సూచించారు. మార్చి ఫస్ట్‌లో ప్రథమ బహుమతి జడ్పీహెచ్‌ఎస్ ఉన్నత పాఠశాల గడ్కోల్ గ్రామం, ద్వితీయ బహుమతి కేజీబీవీ పెదవాల్గోట్ గ్రామానికి బహుమతుల ప్రదానం అందజేశారు. మండల స్థాయి అంతర్ పాఠశాల క్రీడోత్సవాలలో అండర్ 14 విభాగంలో 18 జట్లు, అండర్ 17 విభాగంలో 14 జట్లు పాల్గొన్నట్టు పిడి సుబ్బయ్య తెలిపారు. మూడు రోజులు జరిగే ఈ క్రీడోత్సవాలలో విద్యార్థులు, యువకులు గొడవలు లేకుండా ఆడాలని ఎంపైర్ నిర్ణయం తుది నిర్ణయమని పీఈటీలకు సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ రాములు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బాకారం రవి, నాయకులు దేగాం సాయన్న, చందర్ నాయక్, గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్ జలంధర్, ప్రతిభ హైస్కూల్ కరస్పాండెంట్ సుంకం హరీష్, పాఠశాల చైర్మన్ శ్రీనివాస్, పీఈటీలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక వేలం

నవతెలంగాణ-పోతంగల్

మండల కేంద్రంలో సీజ్ చేసిన 60 ట్రాక్టర్ ట్రిప్పుల ఇసుకను శనివారం తహసిల్దార్ కార్యాలయంలో వేలం నిర్వహించారు. ఈ సందర్భంగా పోతంగల్ గ్రామానికి చెందిన సుధాం వినోద్ రూ.66,000 లకు అత్యధిక వేలం ద్వారా స్వాధీనం చేసుకున్నట్టు తహసీల్దార్ జె.మల్లయ్య తెలిపారు.

నవీపేట్ ఇన్చార్జ్ ఎంఈఓగా సక్కి అశోక్

నవతెలంగాణ-నవీపేట్

మండల నూతన ఇంచార్జ్ ఎంఈఓగా జన్నేపల్లి ఉన్నత పాఠశాల ప్రిన్సిపాల్ సక్కి అశోక్ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా పిఆర్టియు నాయకులు ఆయనను శాలువాతో సత్కరించి ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో విద్యాభివృద్ధికి కృషి చేస్తానని అందరూ సహకరించాలని కోరారు.


ఎంఈవోను సన్మానించిన పీఆర్టీయు నాయకులు

మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం

నవతెలంగాణ-పొతంగల్

మండలం లోని హంగర్గా గుట్టలో రెండు రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందిన పుట్ట మదారి కుటుంబానికి ఎంపి హకీమ్ రూ.5000 ఆర్థిక సహాయాన్ని శనివారం ఆయన భార్య సరూబాయికి అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లాపల్లి సర్పంచ్ అమీనాబి షేరు, ఎమ్మార్పీఎస్ మండల ఉపాధ్యక్షులు రాములు తదితరులు పాల్గొన్నారు.


ఆర్థికసాయం అందజేస్తున్న దృశ్యం

కొబ్బరి చిప్పల పోగుకోసం అక్టోబర్ 1న వేలం

నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్

మాధవనగర్‌లోని సాయి బాబా ఆలయంలో కొబ్బరి చిప్పలను పోగుచేసుకునేందుకు గానూ అక్టోబర్ 1న బహిరంగ వేలం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో రవీందర్ గుప్తా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సెప్టెంబర్ 10, 20వ తేదీల్లో వేలం వేస్తున్నట్టు ప్రకటించినా.. ఎవరూ ముందుకు రాకపోవడంతో వేలం వేసే తేదీలో మార్పు చేసినట్టు పేర్కొన్నారు. ఆసక్తి గలవారు అక్టోబర్ 1న వేలంలో పాల్గొనాలని సూచించారు. ముందుగా రూ.5వేలు సొమ్ము చెల్లించి ఈ బహిరంగ వేలంలో పాల్గొనాలని తెలిపారు.



క్రీడా దుస్తులు వితరణ

నవతెలంగాణ-సిరికొండ

మండలం లోని రావుట్ల గ్రామానికి చెందిన ఇట్టంపేట రఘు తన తండ్రి ఇట్టంపేట లింగం స్మార కార్థం రూ.20వేల విలువైన క్రీడా దుస్తులను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రావుట్ల విద్యార్థులకు శనివారం అందించారు. మండల స్థాయి అంతర్ పాఠశాల క్రీడోత్సవాల దృష్ట్యా విద్యార్థులకు దుస్తులను అందించారు. కార్యక్రమంలో క్రీడా దుస్తుల దాత రఘు, ప్రధానోపాధ్యాయులు సిహెచ్ శ్రీనివాస్, ఉపాధ్యాయులు శ్రీనివాస్, ఉమా శేఖర్, పోశెట్టి విద్యార్థులు పాల్గొన్నారు.


విద్యార్థులకు క్రీడాదుస్తులు అందజేసిన పలువురు

రూరల్ సీఐకి ఎమ్మార్పీఎస్ నాయకుల సన్మానం


సీఐని సన్మానిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

నవతెలంగాణ-బోధన్

బోధన్ రూరల్ సీఐగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన విజయ్ బాబును ఎమ్మార్పీఎస్ నాయకులు శనివారం మర్యాదపూర్వకంగా కలుసుకుని సన్మానించారు. అలాగే బోధన్ రూరల్ సీఐగా పనిచేసి బదిలీపై వెళ్తున్న నరేష్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి భూమయ్య, జిల్లా సహాయ కార్యదర్శి బందారి పోశెట్టి, సీనియర్ నాయకులు గంధమాల చంద్రయ్య, టౌన్ అధ్యక్షులు తాడెం అబ్బయ్య, బోధన్ పట్టణ కార్యదర్శి బొడ్డు రవి, ఎంఎస్పీ నియోజకవర్గ నాయకులు జాదవ్ ఫకీర నాయక్, పిల్లల ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

నోటీస్ బోర్డ్ పై ఓటర్ తుది జాబితాను ఏర్పాటు

- గ్రేడ్ వన్ కార్యదర్శి నిట్టు కిషన్‌రావు


నోటీస్ బోర్డుపై ఏర్పాటు చేసిన ఓటర్ తుది జాబితా

నవతెలంగాణ-డిచ్‌పల్లి

జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు డిపిఓ శ్రీనివాసరావు ఆదేశాల మేరకు నడిపల్లి మేజర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో నోటీసు బోర్డులపై గ్రామపంచాయతీ పరిధిలో మొత్తం 14 వార్డులో ఉన్న ఓటర్ లిస్టులో వారి ఫోటో ఎన్నికల తుది జాబితాలను శనివారం ఏర్పాటు చేసినట్టు మేజర్ గ్రామ పంచాయతీ గ్రేడ్ వన్ కార్యదర్శి నిట్టు కిషన్ రావు తెలిపారు. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ రంజిత్ కుమార్, బిల్ కలెక్టర్లు సంతోష్, రాము, సిబ్బంది నర్సయ్య, బాబా తదితరులున్నారు.

బెస్ట్ సోషల్ వర్కర్‌గా సోపాన్

• మథర్ తెరిస్సా ఇంటర్‌నేషనల్ అవార్డు అందజేత

నవతెలంగాణ-మద్నూర్

సామాజిక సేవలో మండల కేంద్రం వాసుడైన డి.సోపాన్ అనే వ్యక్తి బెస్ట్ సోషల్ వర్కర్‌గా ఎంపికయ్యారు. ఆయనకు యూనివర్సిటీ ఆఫ్ సొలోసా మెక్సికో ద్వారా మథర్ తెరిస్సా ఇంటర్‌నేషనల్ అవార్డును ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ హైదరాబాద్ కర్ణాటక రూరల్ డెవలప్మెంట్ సొసైటీ గుల్బర్గా శోభారాణి, యూనివర్సిటీ ఆఫ్ తోలోస మెక్సికో కంట్రీ డైరెక్టర్ ఇండియా డాక్టర్ వి కట్ట బొమ్మను చేతులు మీదుగా అవార్డును అందుకున్నారు. బెస్ట్ సోషల్ వర్కర్‌గా గుర్తింపు పొందిన డి.సోపాన్‌కు కర్ణాటకలో అవార్డును అందజేశారు. డి.సోపాన్ బెస్ట్ సోషల్ వర్కర్‌గా ఎంపిక కావడం పట్ల గ్రామస్తులు అభినందించారు.



అవార్డును అందుకుంటున్న సోపాన్

మెనూ ప్రకారం భోజనం అందించాలి

నవతెలంగాణ-నసురుల్లాబాద్

విద్యార్థుల సంక్షేమం లక్ష్యంగా ప్రభుత్వ గురుకులల్లో నాణ్యమైన విద్యతో పాటు నాణ్యమైన భోజనం అందిస్తుందని, మెనూ ప్రకారం విద్యార్థులకు అందించాలని నసురుల్లాబాద్ మండల ప్రత్యేక అధికారి దయానంద్ సూచించారు. శనివారం మండల కేంద్రంలోని గిరిజన బాలుర గురుకుల పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులను పాఠశాల గదులను వంటశాల ఆయన పరిశీలించారు. పాఠశాలలో కల్పిస్తున్న వసతులపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. వీరి వెంట ఇంచార్జ్ ఎంపీడీవో సూర్యకాంత్ , పాఠశాల ప్రిన్సిపల్ మాధవరావు, గ్రామ కార్యదర్శి రాజేష్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



భోజనాన్ని పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి

అప్పులు సకాలంలో చెల్లించి సొసైటీ అభివృద్ధికి తోడ్పడాలి

• సొసైటీ చైర్మన్ సాయికుమార్



మాట్లాడుతున్న సొసైటీ చైర్మన్ సాయికుమార్

నవతెలంగాణ-గాంధారి

రైతులు తీసుకున్న అప్పులు సకలంలో చెల్లించి సంఘ అభివృద్ధికి తోడ్పడాలని సొసైటీ చైర్మన్ సాయికుమార్ అన్నారు. గాంధారి మండల కేంద్రంలోని గాంధారి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ చైర్మన్, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా డిసీసీబీ, ఐడిసిఎంఎస్ డైరెక్టర్ పెద్దబూరి సాయికుమార్ అధ్యక్షతన సహకార సంఘ ఆవరణలో మహాజన సభ నిర్వహించారు. త్వరలోనే సంఘ పరిధిలో ఉన్నా నేరల్, పెట్ సంగెం గ్రామలలో గోదాం నిర్మాణ పనులు ప్రారంభిస్తామని తెలిపారు. సొసైటీ కార్యదర్శి సాయిలు సొసైటీ వార్షిక లావాదేవీలు చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి చెర్మెన్ పరమేష్, గాంధారి తాజా మాజీ సర్పంచ్ మమ్మాయి సంజీవ్ యాదవ్, సొసైటీ వైస్ చైర్మన్ ఉదల్ సింగ్ ,సొసైటీ డైరెక్టర్లు ధోల్లు సాయిలు , గాండ్ల లక్ష్మణ్ ,రొడ్డ అశోక్ రెడ్డి, ఆర్ల శివాజీ రావు, వజీర్ సవితా బాయి రావు, గొల్ల హర్షయ్య, పయ్యల జనార్ధన్, గోవింద్ గణపతిరావు, సొసైటీ కార్యదర్శి సాయిలు, సిబ్బంది సాయిరాం, రాహుల్, నవీన్ రైతులు తదితరులు పాల్గొన్నారు

మిషన్ భగీరథ కాల్వలో పడి వ్యక్తి మృతి



కాల్వలో పడి మృతి చెందిన మెట్టు సంజీవులు

నవతెలంగాణ-నిజాంసాగర్

మిషన్ భగీరథ కాలువలో పడి వ్యక్తి మృతి చెందిన ఘటన మహ్మద్ నగర్ మండలంలోని గాలిపూర్ అటవీ ప్రాంతంలో చోటుచేసుకుంది. ఎస్ఐ సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. గత మూడు రోజుల నుండి ఇంట్లో నుండి వెళ్ళిపోయి శనివారం ఉదయం 8 గంటల సమయంలో తుంకి పల్లి తండా గ్రామానికి చెందిన వసంత్ అనే వ్యక్తి ఆ దారి గుండా వెళ్ళగా కాలువలో ఉన్న శవాన్ని చూసి పోలీసులకు సమాచారం ఇచ్చినట్టు తెలిపారు. పోలీసులు పరిశీలించగా తుంకి పల్లి గ్రామానికి చెందిన మెట్టు సంజీవులు (56)గా గుర్తించినట్టు తెలిపారు. మృతుడికి భార్య ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. కూతుర్లకు వివాహం అవ్వగా గత 25 సంవత్సరాలుగా భార్య పిల్లలు హైదరాబాద్ లోనే ఉంటున్నారని ఇతను ఒంటరిగా జీవిస్తూ మద్యానికి బానిసైనట్టు తెలిపారు. తన అన్న లచ్చయ్య దరఖాస్తు ఇవ్వగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

రేబిస్ వ్యాధిపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలి

• జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

నవతెలంగాణ-కామారెడ్డి

రేబిస్ వ్యాధిపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. శనివారం కలెక్టర్ కార్యాలయంలో ప్రపంచ రెబిస్ వ్యాధి దినోత్సవం సందర్భంగా గోడ ప్రతిని (వల్పోస్టర్)ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రేబిస్ ప్రాణాంతక వ్యాదని అన్నారు. కుక్క కాటుకు గురికాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. కుక్క కరచిన వెంటనే శుభ్రమైన నీటితో కడిగి వెంటనే వైద్యుడిని సంప్రదించాలన్నారు. పెంపుడు కుక్కలకు టీకాలు వేయించాలని తెలిపారు. పాఠశాలల విద్యార్థులకు, యువతకు, ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా పశుసంవర్ధక అధికారి రాజేశ్వర్, జిల్లా గ్రామాభివద్ధి అధికారి సురేందర్, సిపిఒ రాజారాం, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్‌రావు, తదితరులు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

కొత్తగా రుణాలు ఇచ్చాం

• సొసైటీ చైర్మన్ నరసింహారెడ్డి

నవతెలంగాణ-నిజాంసాగర్

కొత్తగా రుణాలు ఇచ్చామని అచ్చంపేట్ సొసైటీ చైర్మన్ నరసింహారెడ్డి అన్నారు. మండలంలోని అచ్చంపేట్ సింగిల్ విండో సొసైటీ చైర్మన్ నరసింహారెడ్డి అధ్యక్షతన సొసైటీ కార్యాలయం ఆవరణలో మహాజన సభను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంఘ సభ్యుల సహాయ సహకారాలతో సొసైటీ నడిపిస్తున్నామని ఆయన అన్నారు. రూ. 30 లక్షల వరకు డిపాజిట్లు నగదు రూపంలో సొసైటీలో ఉన్నాయని, 50వేల రూపాయల వరకు ఫర్టిలైజర్ మందులు ఉన్నాయని తెలిపారు. సొసైటీ లాభాల బాటలో నడిపించే విధంగా సంఘ సభ్యులు అందరూ వచ్చే సీజన్ లో ఎక్కువ మొత్తంలో ధాన్యాన్ని సేకరించవలసిన అవసరం ఉందని తెలిపారు. సొసైటీ పరిధిలోని రైతులకు నాలుగు కోట్ల 20 లక్షల వరకు రుణాలు ఇచ్చామని దానిలో నుండి ఒక కోటి 48 లక్షల వరకు రుణమాఫీ అయిందని ఆయన తెలిపారు. మళ్లీ కొత్తగా ఒక కోటి 36 లక్షల కొత్తగా రైతులకు రుణాలు ఇచ్చామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్, డైరెక్టర్లు రాములు, సాయిలు, లంబడి సక్రి ,విటల్ గౌడ్, కాశయ్య, గవ్వల సంగయ్య, విట్టాగౌడ్, గైని సాయవ్వ, గంగమని, భూమయ్య,రాజం సాయిలు, సొసైటీ సీఈఓ సంఘ గౌడ్ బిఆర్ఎస్ సీనియర్ నాయకులు పట్లోళ్ల దుర్గారెడ్డి, రమేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పలువురు

విద్యార్థులకు ఇబ్బందులు రానీయొద్దు

• బిచ్కుంద డిగ్రీ కళాశాల సందర్శించిన బాన్సువాడ సబ్ కలెక్టర్

నవతెలంగాణ-బిచ్కుంద

విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలవకుండా చూడాలని బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి అధ్యాపకులకు సూచించారు. బిచ్కుంద మండలం దడ్గీ చౌరస్తాలో గల ప్రభుత్వ డిగ్రీ కళాశాలను బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి సందర్శించారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ వెంకటేశం, అధ్యాపకులు మొదటిసారిగా కళాశాలను సందర్శించిన సబ్ కలెక్టర్‌ని శాలువాతో సత్కరించారు. కళాశాల ప్రాంగణం అంతా తిరిగి పరిసరాల శుభ్రత పట్ల, కళాశాలలోని పచ్చదనం చూసి సంతోషాన్ని వ్యక్తం చేశారు. కళాశాలలో నిర్వహిస్తున్న తరగతులు, వసతులను అడిగి తెలుసుకున్నారు. కళాశాల న్యాక్ "ఏ" గ్రేడ్ సాధించి, స్వయంప్రతిపత్తి హోదాను పొందడం పట్ల కళాశాల ప్రిన్సిపల్ ను, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందిని అభినందించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపక బృందం విద్యార్థులు పాల్గొన్నారు.



సబ్ కలెక్టర్‌ను సన్మానించిన పలువురు

అక్యూప్రేషర్ శిబిరానికి స్పందన

నవతెలంగాణ-నసురుల్లాబాద్

బీర్కూర్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం ఆర్యవైశ్య సంఘ భవనంలో నిర్వహించిన అక్యూప్రేషర్, మాగ్నేటిక్, వైబ్రేషన్ చికిత్స శిబిరానికి అనూహ్య స్పందన లభించినట్టు నిర్వాహకులు తెలిపారు. ఈ శిబిరం వారం రోజుల పాటు కొనసాగుతుందని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని లయన్స్ క్లబ్ జోనల్ చైర్మన్ హలగి శ్రీనివాస్ మండల అధ్యక్షుడు మేకల గాలయ్య, తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజి ఎంపీపీ రఘు, రైతు సమన్వయ అధ్యక్షుడు అవారి గంగారాం, లయన్స్ జోన్ చైర్మన్ హరిగే శ్రీనివాస్, సభ్యులు మేకల విట్టల్,కొట్టూరి సంతోష్, రషీద్, వీరయ్య, భూషణ్, మాజి సర్పంచ్ సానేపు గంగారాం, మియ్యపురం శశికాంత్, కోరిమె రఘు, మన్నన్ తదితరులు పాల్గొన్నారు.

వీఆర్ఏ వారసులకు నియామక ఉత్తర్వులు జారీచేయండి

• బాన్సువాడ సబ్ కలెక్టర్‌కు వినతి పత్రం అందజేత

నవతెలంగాణ-మద్నూర్

గత తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విడు దల చేసినటువంటి జీవో ప్రకారం 61 సంవ త్సరాలు పైబడిన వీఆర్ఎల వారసులకు త్వరితగతిన నియామక ఉత్తర్వులు ఇప్పించా లని సబ్‌కలెక్టర్ కిరణ్మయికి పలువురు వీఆర్ఏ వారసులు వినతిపత్రం అందజేశా రు. మండల కేంద్రంలో సబ్ కలెక్టర్ శనివా రం పర్యటించిన ఆమెను కలిసి వినతిపత్ర ం అందజేశారు. రాష్ట్రంలో గల 3797 మంది 61 సంవ త్సరాలు పైబడిన విఆర్ఎ వారసులకు నియామక ఉత్తర్వు లు ఇవ్వనందువలన కుటుంబాల ఆర్థిక పరిస్థితి అగమ్య గోచరంగా మారిందని, మానసికంగా కూడా ఎంతో కుంగి పోతున్నట్టు తెలిపారు. మానవీయ కోణంలో ఆలోచించి నియామక ఉత్తర్వులు ఇప్పించి తమ కుటుంబాలను ఆదు కోవాలని విన్నవించారు. మద్నూర్ మండలానికి చెందిన ఉల్లాజీ, రమేష్ ,హనుమాన్లు, తానాజీ , తదితరులు సబ్ కలెక్టర్ ను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు.



సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న పలువురు

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

• మున్సిపల్ చైర్‌పర్సన్

నవతెలంగాణ-కామారెడ్డి

మన చుట్టుపక్కల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియా అన్నారు. శనివారం స్వచ్ఛత హి కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ హాజరయి మున్సిపల్ పరిధిలోని 32 వార్డులో మాస్ క్లీనింగ్ డ్రైవ్‌లో భాగంగా పబ్లిక్ టాయిలెట్, చుట్టుపక్కల ఉండే ప్రదేశాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మన చుట్టుపక్కల పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే మనం ఆరోగ్యంగా ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సుజాత, వార్డు కౌన్సిలర్ అనూష, మాధురి ప్రసన్న కుమార్, పాత శివ కృష్ణమూర్తి. చాట్ల రాజేశ్వర్, తయబ సుల్తానా సలీం, వనిత రామ్మోహన్, మనసా సురేష్, సానిటరీ ఎస్పై పర్వేజ్, మోమిన్, తదితరులు పాల్గొన్నారు.



చెత్తను శుభ్రం చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్

కుక్కలకు యాంటీ రేబిస్ టీకాలు

నవతెలంగాణ-మద్నూర్

ప్రపంచ రేబిస్ దినోత్సవం సందర్భంగా మద్నూర్ మండల కేంద్రంలోని పశువైద్య ఆసుపత్రిలో శనివారం కుక్కలకు యాంటీ రేబీస్ టీకాలు వేసే కార్యక్రమం నిర్వహించారు. పెంపకం దారులు శునకాలకు యాంటీ రేబీస్ టీకాలు ఇప్పించాలని పశువైద్యులు సూచించారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్ సునీత, ఆఫీస్ సబ్ ఆర్డినేటర్ ఎం.ఏ. ఆలీమ్, కుక్కల పెంపకం దారులు తదితరులు పాల్గొన్నారు.

రామారెడ్డి : రేబిస్ వ్యాధి ప్రాణాంతకమైనదని, నివారణనే మార్గమని మండల పశువైద్యాధికారి రామ్ చందర్ అన్నారు. ప్రపంచ రేబిస్ దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం మండల కేంద్రంలోని పశు వైద్యశాలలో 22 పెంపుడు కుక్కలకు, ప్రభుత్వం అందిస్తున్న ఉచిత రేబిస్ టీకాలను అందజేశారు. ఈ సందర్భంగా రామచంద్ర మాట్లాడుతూ.... పెంపుడు కుక్కలు పెంచుకునే యజమానులు తప్పకుండా కుక్కలకు రేబీస్ టీకాలను వేయించాలని సూచించారు. కార్యక్రమంలో పశు వైద్యులు శ్రీనివాసరావు, నారాయణ, రమేష్, సిబ్బంది ఆంజనేయులు, బాలమణి తదితరులు ఉన్నారు.

నాగిరెడ్డిపేట్ : ప్రపంచ రేబిస్ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలో గల పశు వైద్యశాలలో 14 కుక్కలకు రేబిస్ టీకాలు వేసినట్లు పశు వైద్యాధికారి రవికుమార్ శనివారం తెలిపారు. కుక్కల పట్ల పాటించాల్సిన జాగ్రత్తలను ఆయన వివరించారు. ఆయన వెంట జేవివో అరుణ్‌కుమార్, విఏ విజయ, ఓఎస్ గౌస్ ఉన్నారు.

ఎల్లారెడ్డి : ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని పశు వైద్యశాలలో శనివారం 16 పెంపుడు కుక్కలకు రేబిస్ వ్యాధి నివారణ టీకాలు వేసినట్లు ఎల్లారెడ్డి మండల పశు వైద్యాధికారి డాక్టర్ రవికుమార్ తెలిపారు. కార్యక్రమంలో ఎల్లారెడ్డి వెటర్నరీ వైద్యశాల సహాయ సంచాలకు సాయిరెడ్డి,సిబ్బంది రమేష్,కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

బి.ఎన్.రావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో పోటీ పరీక్షల పుస్తకాల వితరణ

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల గ్రంథాలయానికి డాక్టర్ బి.ఎన్.రావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో పోటీ పరీక్షల పుస్తకాలను శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ వ్యవస్థాపకులు బి.ఎన్.రావు మాట్లాడుతూ గ్రామీణ పేద విద్యార్థులు పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలను స్వయంగా కొనుగోలు చేయలేక ఉద్యోగాలకు దూరమవుతున్నారని విషయాన్ని గుర్తించి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు అందుబాటులో ఉండే విధంగా 14 రకాల పుస్తకాల చెట్లను లైబ్రరీకి అందించామన్నారు. యువత నిరుద్యోగ సమస్యను అధిగమించే విధంగా సిద్ధం కావాలని కోరారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ విజయ్ కుమార్ మాట్లాడుతూ ఈ పుస్తకాలను సద్వినియోగం చేసుకొని ఉద్యోగాలను సాధించే విధంగా సిద్ధం కావాలని కోరారు. కళాశాలలో కెరీర్ గైడెన్స్ పోటీపరీక్షల విభాగం నిరంతరం ఉద్యోగాలు కొరకు చేపట్టే కార్యక్రమాలను సంపూర్ణంగా వినియోగించుకోవాలనికోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కిష్టయ్య, లైబ్రరీ అధిపతి లక్ష్మణాచారి, డాక్టర్ శ్రీనివాసరావు,జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఎంఈవోకు సన్మానం

నవతెలంగాణ-నసురుల్లాబాద్

నసురుల్లాబాద్ ఎంఈవోగా ఇటీవల నూతనంగా బాధ్యతలు స్వీకరించిన నసురుల్లాబాద్ జడ్పీఎచ్ఎస్ హై స్కూల్ ప్రధాన ఉపాధ్యాయుడు చందర్ కు బొప్పాస్ పల్లి గ్రామ గిరిజన నాయకులు శనివారం నసురుల్లాబాద్ మండల కేంద్రంలోని మండల విద్యాశాఖ కార్యాలయంలో సన్మానించారు. విద్యాభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు బలరాం, మాజీ సర్పంచ్ సత్య నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సైకి అంబేద్కర్ చిత్రపటం అందజేత

నవతెలంగాణ-సదాశివనగర్

సదాశివనగర్ మండలానికి నూతనంగా వచ్చిన ఎస్ఐ రంజిత్ కుమార్‌ను శనివారం మాజీ జడ్పీటీసీ కమిలి నర్సింలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాజ్యాంగ నిర్మాత ప్రపంచ మేదావి డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ చిత్ర పటాన్ని అందించారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు గైని రమేష్ ఉన్నారు.

మహిళాలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

నవతెలంగాణ-దోమకొండ

దోమకొండ మండల సమాఖ్య కార్యాలయంలో జిల్లా అదనపు గ్రామీణభివృద్ధి అధికారి మురళి కృష్ణ ఆధ్వర్యంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు గౌరు లక్ష్మి అధ్యక్షతన 17 వ మండల వార్షికోత్సవ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సమావేశంలో 2023-24 వార్షిక నివేదిక చదివి అలాగే రాబోయే సంవత్సరంలో చేపట్టబోయే కార్యక్రమాల ప్రణాళికను తీర్మానం చేశారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు గ్రామీణాభివృద్ధి అధికారి మురళీకృష్ణ మాట్లాడుతూ గ్రామ సంఘము మహిళాలు బ్యాంకు లింకేజి, స్త్రీ నిధి రుణాలు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కోరారు. సమావేశంలో ఏపీఎం రాజు,సీసీ రామకృష్ణ,అకౌంటెంట్ స్వాతి, గ్రామ సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.

రేపు పద్మాజివాడి సొసైటీ మహాజన సభ

నవతెలంగాణ-సదాశివనగర్

మండలం లోని పద్మాజివాడి ప్రాథమిక సహకార సంఘం మహాజన సభ సోమవారం నిర్వహిస్తున్న ట్లు చైర్మన్ గంగాధర్ శనివారం తెలిపారు. మహా జన సభ పద్మాజివాడి రైతు వేదిక లో ఉదయం.11-00 గంటల కు సభ నిర్వహిస్తున్న ట్లు తెలిపారు. రైతులు సకాలంలో హజరై సభను విజయవంతం చేయాలని కోరారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

నవతెలంగాణ-లింగంపేట్

లింగంపేట్ మండలంలోని మంభోజిపేట తండాకు చెందిన దాసోది కి శనివారం మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి కింద చెక్కు అందజేసినట్టు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బుర్ర నారా గౌడ్ తెలిపారు. అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రిలో చికిత్స పొంది సహాయ నిధి కోసం అర్జీ చేసుకోవడంతో ఎమ్మెల్యే కృషితో మంజూరైన రూ.60 వేల చెక్కును అందజేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల యూత్ అధ్యక్షులు రాజు, మండల సోషల్ మీడియా కోఆర్డినేటర్ నగేష్, భాస్కర్ గౌడ్, పాల్గొన్నారు.

భారతీయ కిసాన్ సంఘ్ నూతన కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన నూతన కార్యవర్గం

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డి గ్రామంలో శనివారం భారతీయ కిసాన్ సంఘ్ నూతన కార్యవర్గం ఎన్నికున్నారు. అధ్యక్షులుగా సంకరి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు దుబ్బాక నర్సారెడ్డి, ప్రధాన కార్యదర్శి శేకెల్లి రమేష్, సహాయ కార్యదర్శి ఎడ్ల నర్సింలు,కోశాధికారిగా కుమ్మరి లింగం కార్య వర్గ సభ్యులు గా కందూరి రాజశేఖర్ చాకలి సంతోష్ , గడ్డం మహేష్, దాకోల్ల బాస్కర్ ,కుమ్మరి రాంచంద్రం , ఎండ్రియాల రవిగౌడ్ సలహా దారులుగా గంపల రాజిరెడ్డి, గడ్డం ఆంజనేయులు,లింబయ్య గారి శ్రీనివాస్రెడ్డి మర్రి పెద్ద సంగారెడ్డి, ఆస గాలయ్య బొలిపెల్లి సంజీవరెడ్డి, పయ్యావుల రవి, మండల కమిటీ మెంబర్ లుగా , శేకెల్లి బాల్ రాజు తెనుగు సుధాకర్ లను ఎన్నుకున్నట్లు అధ్యక్షుడు శ్రీనివాస్ తెలిపారు.

మైనార్టీసెల్ నాయకుడికి సన్మానం

నవతెలంగాణ-లింగంపేట్

కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మైనార్టీ సెల్ నాయకులు మొహమ్మద్ ఖాసిఫ్ కుటుంబ సభ్యులకు శనివారం లింగంపేట్ గ్రామానికి చెందిన ముస్లిం యువకులు సన్మానించారు. అజ్మీర్ షరీఫ్ దర్గా దర్శనం కోసం మమ్మద్ ఖాసిఫ్, ఆయన తల్లి నెహ్రూనిసా బేగం స్వచ్ఛందంగా ముందుకు వచ్చి పదిమంది మైనార్టీ యువకులను సొంత డబ్బులతో శనివారం సాయంత్రం అజ్మీర్ దర్గా దర్శనానికి పంపించినట్టు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని యువకుల్లో మార్పు రావాలని అజ్మీర్ షరీఫ్ యాత్ర విజయవంతం చేసుకోవాలని ఆయన సూచించారు.



చిత్రపటం అందజేస్తున్న యువకులు

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

నవతెలంగాణ-రామారెడ్డి

మండల కేంద్రంలో జాజీకోర్ బుచ్చయ్య ఆర్థిక ఇబ్బందులతో, అనారోగ్యంతో ఆత్మహత్య చేసుకుని మృతిచెందగా, బాధిత కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లో ఉందని తెలుసుకున్న నా రెడ్డి స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు నా రెడ్డి మోహన్ రెడ్డి శనివారం బాధిత కుటుంబానికి 50 కేజీల బియ్యం తో పాటు, రూ 2000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. తోటి వారు ఆపదలో ఉన్నప్పుడు, తోచిన మేరకు ఆర్థిక సహాయం అందించడం మానవత్వం అని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు జి రెడ్డి మహేందర్ రెడ్డి, మండల అధ్యక్షులు గొల్లపల్లి లక్ష్మా గౌడ్, కాంగ్రెస్ నాయకులు తూర్పు రాజు, రంజిత్, నామాల రవి, తదితరులు పాల్గొన్నారు.

బాలల హక్కులపై అవగాహన

నవతెలంగాణ-లింగంపేట్

లింగంపేట్ మండల సమీపంలోని నల్ల మడుగు చౌరస్తాలో గల జ్యోతి బాపులే వెనుకబడిన తరగతుల రెసిడెన్షియల్ పాఠశాలలో బాలల హక్కులపై శనివారం అవగాహన కల్పించారు. జిల్లా బాలల పరిరక్షణ విభాగం సూర్య ప్రకాష్ మోహన్ నాయక్ తెలిపారు. బాల్య వివాహాలు, బాల కార్మికులు, డ్రాపౌట్ నివారణ మరియు బాలల లైంగిక నేరాల నుండి పిల్లల రక్షణ పోక్సో చట్టం 2012పై ప్రత్యేకంగా దృష్టి సారించి బాలల హక్కులపై విద్యార్థులకు అవగాహన కల్పించామన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ఉపాధ్యాయుల బృందం సిబ్బంది తదితరులు ఉన్నారు.

అంగన్‌వాడీలో పోషణ మాస సంబురాలు

నవతెలంగాణ-రామారెడ్డి

పోషణ మాసం పునస్కరించుకొని మండలంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం పోషణ మాస సంబురాలను నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా గర్భవతులు బాలింతలు చిన్నారులు పౌష్టికాహారం తీసుకోవడం ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. ఆరు నెలల నిండిన చిన్నారులకు అన్నప్రాసన చేశారు. బాలామృతం తీసుకోవడం వల్ల చిన్నారులకు అనేక ప్రయోజనాలు ఉన్నాయని అంగన్వాడీ కార్యకర్త ఇందిరా తెలియజేశారు కార్యక్రమంలో అంగన్వాడి కార్యకర్త ఇందిరా అంగన్వాడి ఆయా తల్లిదండ్రులు పాల్గొన్నారు

తుది ఓటర్ జాబితా ప్రచురణ

నవతెలంగాణ-దోమకొండ/ఎల్లారెడ్డి/నాగిరెడ్డిపేట్

గ్రామ పంచాయతీ తుది ఓటర్ జాబితాను సిద్ధం చేశామని ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్ అన్నారు. దోమకొండ మండల పరిషత్ కార్యాలయంలో ఓటరు జాబితాను నోటీస్ బోర్డు పై ప్రచురించారు. గ్రామ పంచాయతీ ఎన్నికల దృష్ట్యా మండలంలోని 9 గ్రామ పంచాయతీల తుది ఓటర్ జాబితా ను అన్ని గ్రామ పంచాయతీల నోటీస్ బోర్డు లతో పాటుగా మండల పరిషత్ కార్యాలయం నోటీస్ బోర్డు పై ప్రజలకు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల పర్యవేక్షకులు మనోహర్, సీనియర్ అసిస్టెంట్ మానిక్ రావు సిబ్బంది పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి : ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఫైనల్ ఓటర్ లిస్ట్ ను ఎల్లారెడ్డి మండల ప్రత్యేక అధికారి,ఆర్డిఓ మన్నే ప్రభాకర్,ఎంపీడీవో లక్ష్మి ఆధ్వర్యంలో విడుదల చేశారు. మండలంలోని 31 గ్రామాల కొత్త ఓటర్ లిస్ట్ సిద్ధంగా ఉందని, అన్ని గ్రామ పంచాయతీల పరిధిలో అందుబాటులో ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ ప్రకాష్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నాగిరెడ్డిపేట్ : మండల కేంద్రంలో గల మండల పరిషత్ కార్యాలయంలో ఓటర్ తుది జాబితా ప్రదర్శించినట్లు ఎంపీడీవో ప్రభాకర్‌చారి శనివారం తెలిపారు. ఆయా గ్రామాలలో గ్రామాల వారీగా గ్రామపంచాయతీలలో ఓటర్స్ తుదిజాబితా ప్రదర్శించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్
ఆదివారం | సెప్టెంబర్ 29, 2024 | www.navatelangana.com

స్కాలర్స్ ఒలంపియాడ్ స్కూల్లో రెడ్, బ్లూ డే సంబరాలు

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని స్కాలర్స్ ఒలంపియాడ్ పాఠశాలలో శనివారం రెడ్, బ్లూ డే సంబరాలు నిర్వహించినట్టు పాఠశాల కరస్పాండెంట్ తాళ్ల వేణు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థిని విద్యార్థులకు చదువుతో పాటు పలు కార్యక్రమాలు నిర్వహిస్తూ అత్యుత్తమ విద్యానందిస్తూ, చిన్నారుల మనోవికాసానికి తోడ్పడే కార్యక్రమాలను సైతం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ జి ఒడ్డెన్న, కో డైరెక్టర్ సహస్ర, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.



రెడ్, బ్లూ డే సంబురాల్లో పాల్గొన్న చిన్నారులు

స్వచ్ఛతాహి సేవ డే 12లో భాగంగా నృత్య ప్రదర్శన

నవతెలంగాణ-కంఠేశ్వర్

నగరంలోని గిరిజన మహిళ డిగ్రీ కళాశాలలో స్వచ్ఛత హి సేవ డే -12లో భాగంగా ఎన్ఎస్ఎస్ వాలంటీర్‌లు స్వచ్ఛత హి సేవ అనే పాటలపైన నృత్య ప్రదర్శనను నిర్వహించి విద్యార్థులకు చుట్టూ ఉన్న పరిసరాల పరిశుభ్రతపై శనివారం అవగాహన కల్పించారు. ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ప్రతీ పనిలో చురుకుగా పాల్గొంటున్నారని వారి సేవలు అభినందనీయమని కళాశాల ప్రిన్సిపాల్ కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ వి.జీ లక్ష్మి, వైస్ ప్రిన్సిపల్ జి.భార్గవి, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ సి.హెచ్ సుష్మిత విద్యార్థులు పాల్గొన్నారు.



నృత్యాలు చేస్తున్న విద్యార్థినిలు

భగత్‌సింగ్ ప్రాణ త్యాగంతోనే స్వాతంత్ర్యం

- 117వ జయంతి సందర్భంగా ఎస్ఎఫ్ఐ ఘన నివాళి

నవతెలంగాణ-విలేకరుల బృందం

కంఠేశ్వర్ : భగత్‌సింగ్ ప్రాణ త్యాగంతోనే దేశానికి స్వాతంత్ర్యం లభించిందని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) జిల్లా కమిటీ సభ్యులు తెలిపారు. స్థానిక నాందేవ్‌వాడలోని జిల్లా కార్యాలయంలో భగత్ సింగ్ చిత్రానికి పూలమాలవేసి శనివారం ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాచకొండ విఘ్నేష్ మాట్లాడుతూ.. బ్రిటీష్ చెర నుంచి ఈ దేశానికి స్వాతంత్ర్యం తీసుకువచ్చిన ప్రముఖులలో భగత్‌సింగ్ మొదటి తరం నాయకుడని అభివర్ణించారు. 23 ఏండ్ల వయసులో తన దేహాన్ని సైతం లెక్కచేయకుండా ఈ దేశం కోసం ప్రాణ త్యాగం చేసిన మహనీయుడు షాహిద్ భగత్ సింగ్ అని కొనియాడారు. భగత్‌సింగ్ తన చిన్న వయసులో బ్రిటీష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాటాలు నిర్వహించి బ్రిటీషర్ల గుండెల్లో గుబులు పుట్టించాడని అన్నారు. అదేవిధంగా చిన్న వయసులోనే ఉరికంబాన్ని ఎక్కి విప్లవం వర్ధిల్లాలని నినాదం ఇచ్చి యువతలో చైతన్యాన్ని నింపాడని గుర్తు చేశారు. కానీ ఈ సమాజ నవ నిర్మాతలు డ్రగ్స్‌కు బానిసగా మారుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా కేంద్ర ప్రభుత్వం భగత్‌సింగ్ లాంటి దేశభక్తి కలిగిన నాయకుల పాఠ్యాంశాలను విద్యార్థులకు అందకుండా తొలగించడం దారుణమని తెలిపారు. ఇందిరా పార్క్ ధర్నాలో అక్రమంగా పెట్టిన కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. భగత్‌సింగ్ స్ఫూర్తితో ఉద్యమిద్దామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు దినేష్, చక్రి, రాజు, సాయి, పాల్గొన్నారు.

పలువురి నివాళి..

షహీద్ భగత్ సింగ్ జయంతి సందర్భంగా భారత ఐక్య విద్యార్థి సమాఖ్య నిజామాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో స్థానిక దేవి రోడ్‌లో గల భగత్ సింగ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అలాగే సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో, ఏఐపీఎస్‌యు ఆధ్వర్యంలో నాయకులు నివాళులర్పించారు.

నిజామాబాద్‌సిటీ : అఖిల భారత ప్రగతిశీల విద్యార్థి సంఘం (ఏఐపీఎస్‌యూ) నిజామాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిజామాబాద్ నగరంలోని భగత్‌సింగ్ చౌరస్తాలో గల భగత్ సింగ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

భీంగల్ రూరల్ : ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ జయంతి వేడుకలను నిర్వహించారు. భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నాయకులు నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు సయ్యద్ రెహమాన్, భీంగల్ మండల ఉపాధ్యక్షుడు పిపావత్ సూరజ్, తదితరులు పాల్గొన్నారు.



కంఠేశ్వర్: భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

భగత్‌సింగ్ స్ఫూర్తితో పోరాడుదాం

- ఖాళీ ప్లాట్లలో సీపీఐ(ఎం) జెండావిష్కరణ



భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

నవతెలంగాణ-వర్ని(చందూర్)

చందూర్ మండల కేంద్రంలోని మర్రి బోగడ కాలనీలో ఇండ్ల పట్టాలున్న నిరుపేదలందరూ భగత్ సింగ్ స్ఫూర్తితో ఇండ్ల స్థలాల కోసం పోరాడాలని సిపిఎం పార్టీ ఏరియా కార్యదర్శి నన్నెసాబ్ తెలిపారు. మర్రి బోగడ కాలనీ పేరును శనివారం భగత్ సింగ్ కాలనీగా నామకరణం చేశారు. భగత్ సింగ్ 117 జయంతి వేడుకలను జరిపి సిపిఎం పార్టీ జెండాను ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇకనుండి చందూర్ ప్రజలందరూ భగత్ సింగ్ కాలనీగా పిలవాలని కోరారు. ఇండ్ల స్థలాల సమస్యపై జిల్లా ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారం కాలేదన్నారు. గత్యంతరం లేక ఎర్రజెండాలు పాతి పేద ప్రజలందరికీ పంపిణీ చేయాలని నిర్ణయించుకున్నామన్నారు. ప్రభుత్వం, అధికారులు పోలీసులను ఉసిగొల్పి ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తే ఉద్యమం మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

కార్యక్రమంలో సాయిబాబా, గంగామణి, సాయిలు, మహేందర్, అబ్బులు, రజియా, బాగవ్వ, అమీనా, దత్తవ్వ ధర్మయ్య తదితరులు పాల్గొన్నారు.

పోతంగల్ మండలంలో సబ్ కలెక్టర్ పర్యటన



అధికారులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్

నవతెలంగాణ-పోతంగల్

మండలంలోని హెగడోలి గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేయనున్న పెట్రోల్ బంక్ స్థలాన్ని సబ్ శనివారం పరిశీలించారు. బంక్ ఏర్పాటు చేసేందుకు నియమ, నిబంధనలు అన్నీ యజమానులు పాటించారా లేదా అనే విషయాల గురించి పరిశీలించారు. అదేవిధంగా పోతంగల్ బ్రిడ్జ్ వద్ద గల చెక్ పోస్ట్‌ను సందర్శించి, రెవెన్యూ, పోలీసు సిబ్బంది చెక్‌పోస్ట్ డ్యూటీలో ఉన్నారా, లేదా అని పరిశీలించారు.

ఉమ్మడి జిల్లా స్థాయి జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ సెలక్షన్స్



బాల్ బ్యాడ్మింటన్ సెలక్షన్‌లో పాల్గొన్న క్రీడాకారులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ పాలిటెక్నిక్ గ్రౌండ్లో జూనియర్ ఉమ్మడి జిల్లా స్థాయి బాల్ బ్యాడ్మింటన్ బాయ్స్ అండ్ గర్ల్స్ సెలక్షన్స్‌ను గురువారం నిర్వహించినట్టు నిజామాబాద్ జిల్లా బాల్ బ్యాట్మెంటన్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్యామ్ తెలిపారు. ఎంపికలకు ఉమ్మడి నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ ఎంపిక కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షులు విద్యాసాగర్‌రెడ్డి, నిజామాబాద్ జిల్లా నెట్ బాల్ అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ రవి, సీనియర్ పిడి రాము, విద్యాసాగర్‌రెడ్డి క్రీడాకారులను ఉదేశించి మాట్లాడారు. అక్టోబర్ నెలలో కామారెడ్డిలో జరిగే 69వ జూనియర్ తెలంగాణ రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ క్రీడా పోటీలలో జిల్లా జట్టును ప్రథమ స్థానంలో నిలపాలని క్రీడాకారులకు తెలియజేశారు. ఎంపికైన క్రీడాకారులకు 28.9.2024 తేదీ నుంచి బాలికలకు జడ్పీహెచ్ఎస్ రెంజల్ పాఠశాలలో, బాలురకు టీఎస్ఆర్ఎస్ ఉప్పల్వాయి పాఠశాలలో శిక్షణ శిబిరాన్ని నిర్వహించి, తుది జట్టును రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపిక చేయనున్నట్టు తెలిపారు. ఈ ఎంపిక కార్యక్రమంలో జిల్లా బాల్ బ్యాడ్మింటన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కృష్ణమూర్తి, కోశాధికారి రాజేశ్వర్, సంఘం బాధ్యులు మహేష్, సురేష్, జ్యోష్ణ, భాగ్యలక్ష్మి, గీత, కార్తీక్, ఆనంద్, సాయికుమార్, అనిల్, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో కుటుంబ సమస్య పరిష్కారం

నవతెలంగాణ-బోధన్

బోధన్ కోర్టులో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో కుటుంబ సమస్య పరిష్కరించారు. బోధన్ పట్టణానికి చెందిన హేమలత తనను తన పిల్లలను తన భర్త రాజు పట్టించుకోవడం లేదని కమ్యూనిటీ మిడియేషన్ సెంటర్‌ను ఆశ్రయించగా వారిని శనివారం నిర్వహించిన లోక్ అదాలత్‌కు పిలిపించి దంపతుల మధ్య ఉన్న సమస్యను న్యాయవాదులు పరిష్కరించారు. హేమలత లోక్ అదాలత్‌లో తన సమస్యను వివరించారు. తనకు ఇల్లు కట్టించి, ఇల్లు కట్టే వరకు తనను కిరాయి ఇంట్లో ఉంచాలని, పిల్లలకు అన్ని విధాలుగా చూసుకోవాలని వివరించారు. లోక్ అదాలత్ బెంచి ఎదుట ఆమె భర్త రాజును పిలిపించి సమస్య రాకుండా భార్య, పిల్లలను బాగా చూసుకోవాలని హెచ్చరించి సమస్య పరిష్కరించారు. కమ్యూనిటీ మెడిటేషన్ సెంటర్ కోఆర్డినేటర్ పద్మాసిగ్, సుజాత, రాజేందర్ సింగ్ పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రిలో ప్రపంచ హృదయ దినోత్సవం

నవతెలంగాణ-ఎడపల్లి

మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో వైద్యులు శనివారం ప్రపంచ హృదయ దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి ఆయుర్వేద విభాగం వైద్యాధికారి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

అనాథ శవానికి అంత్యక్రియలు

నవతెలంగాణ-కంఠేశ్వర్

గత 4 రోజుల క్రితం గుర్తు తెలియని వ్యక్తి అనారోగ్యంతో మృతిచెందగా అతని సంబంధీకులు ఎవరూ రాకపోవడంతో పోలీసులు అతనిని అనాథగా గుర్తించి 3వ పోలీస్‌స్టేషన్ ఎస్.ఐ మహేష్ ఇందూరు యువత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం దేవి థియేటర్ ప్రక్కన గల సార్వజనిక్ స్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రూరల్ పోలీస్ స్టేషన్ సిబ్బంది అర్జున్, ఇందూరు యువత స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకులు మద్దుకూరి సాయిబాబు, కార్యదర్శి జయదేవ్ వ్యాస్, సాయితేజ, పురుషోత్తంరెడ్డి, 3వ ఠాణా పోలీస్ సిబ్బంది తాయూబ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కవిత కనిపించట్లే

- వన్‌టౌన్‌లో తెలంగాణ ఉద్యమకారుల ఫిర్యాదు

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఒకటవ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కనిపించడం లేదని జిల్లా కేంద్రానికి చెందిన తెలంగాణ ఉద్యమకారులు ఆడె ప్రవీణ్, కోనేరు సాయికుమార్, ఈర్ల శేఖర్ తదితరులు శనివారం ఒకటవ పోలీస్‌స్టేషన్‌లో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. లిక్కర్ కేసులో జైలుకు వెళ్లక ముందు నుంచి కవిత నిజామాబాద్ ప్రజలకు కనిపించకుండా పోయారని, బెయిల్‌పై బయటికి వచ్చిన తరువాత కూడా ఆమె ప్రజల్లోకి రావడం లేదని అన్నారు. ప్రజలు చెల్లించే పన్నుతో వేతనం, అలవెన్సులు తీసుకుంటున్న ఎమ్మెల్సీ ప్రజలకు కనిపించకుండా పోవడంతో తాము పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. ఆమె ఆచూకీ కనుగుని ప్రజలకు తెలియజేయాలని పోలీసులను కోరినట్లు తెలిపారు.

నూతన ఎంఈఓలకు సన్మానం



ఎంఈఓలను సన్మానించిన పలువురు

నవతెలంగాణ-ముప్కాల్

ముప్కాల్ మండల శాఖ నూతన కార్యవర్గం ఏర్పడిన సందర్భంగా ముప్కాల్ మండల 'ఫుల్ అడిషనల్ ఇంఛార్జి' మండల విద్యాశాఖ అధికారులుగా బాధ్యతలు స్వీకరించిన జక్కుల రవి కుమార్, మెండోరా మండల ఫుల్ అడిషనల్ ఇంఛార్జి విద్యాశాఖ అధికారిగా దేగాం శ్రీనివాస్ లను మండల శాఖ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించినట్టు పీఆర్టీయూ టీఎస్ అధ్యక్షులు కొత్తపల్లి శ్రీనివాస్ శనివారం తెలిపారు. అదేవిధంగా ముప్కాల్, పోచంపాడ్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులైన యం.గంగారాం, జి.శుభను సైతం ఈ సందర్భంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి కొండ్రు నవీన్, జిల్లా మాజీ అసోసియేట్ అధ్యక్షులు టీ.లక్ష్మణ్, ముప్కాల్ కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ వినోద, పీఆర్టీయూ సీనియర్ నాయకులు శ్రీనివాస్ శైవ శ్రీనివాస్, బషీరుద్దీన్, ఇంద్రసేనా రెడ్డి, శాంతి కుమార్, ఉషారాణి పాల్గొన్నారు.

కార్పోరేట్ వ్యవసాయ విధానానికి వ్యతిరేకంగా పోరాడాలి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

బీజేపీ కార్పోరేట్ వ్యవసాయ విధానానికి వ్యతిరేకంగా పోరాటాన్ని ఉధృతం చేయాలని సంయుక్త కిసాన్ మోర్చా జాతీయ కమిటీ (ఎస్కేఎం) నాయకులు పిలుపునిచ్చారు. సంయుక్త కిసాన్ మోర్చా జాతీయ కమిటీ పిలుపులో భాగంగా జిల్లా కేంద్రంలో భగత్ సింగ్ విగ్రహానికి సంయుక్త కిసాన్ మోర్చా నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నాయకులు వి.ప్రభాకర్, కంజర భూమయ్య, పి.వెంకటేష్, సారా సురేష్, రాజేశ్వర్, దుడ్డు గంగాధర్, గుమ్ముల గంగాధర్, పుట్టి నాగన్న, అశోక్, కళాకారుడు సిర్పలింగం, మహిపాల్, తదితరులు పాల్గొన్నారు.

మహేష్‌కుమార్‌గౌడ్‌ను కలిసిన మాక్లూర్ నాయకులు

నవతెలంగాణ-మాక్లూర్

మండలంలోని పలువురు కాంగ్రెస్ నాయకులు పీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్‌ను హైదారాబాద్‌లోని గాంధీభవన్‌లో శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఆయనను కలిసిన వారిలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు రవి ప్రకాష్, సీనియర్ కాంగ్రెస్ కార్యకర్తలు పురుషోత్తం, నరసయ్య, స్వామి, జైల్ సింగ్ పాల్గొన్నారు.

చేతి పంపులపై శిక్షణ

నవతెలంగాణ-మాక్లూర్

మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో వాటర్ మెన్‌లు మోటార్ పంపుల వద్ద తగు జాగ్రత్తలు పాటించాలని సిఇ రాంచదర్ తెలిపారు. శనివారం రెండవ రోజు చేతి పంపులపై శిక్షణను ఇచ్చారు. వివిధ గ్రామపంచాయతీ వాటర్ మెన్‌లకు పంపు సెట్లపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఈఈ రాకేష్, డీఈ గంగారాం, మండల పంచాయతీ అధికారి శ్రీనివాస్, ఏఈలు అనిల్, అన్వేష్, జీపీవాటర్ మెన్‌లు పాల్గొన్నారు.

జీవో 25ను సవరించాలి

- ఉపాధ్యాయుల డిమాండ్

నవతెలంగాణ-వర్ని(చందూర్)

మండల కేంద్రంలోని ప్రభుత్వ స్కూల్‌లో మధ్యాహ్నం భోజన సమయంలో ఉపాధ్యాయులు జీవో 25ను ప్రభుత్వం సవరించాలని జాక్టో పక్షాన నల్ల బ్యాడ్జిలు ధరించి నిరసన తెలిపారు. జీవో 25ను సవరించిన తదుపరి ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలన్నారు. బదిలీ అయిన ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలని, ప్రతి ప్రాథమిక పాఠశాలలో ఒక ప్రధానోపాధ్యాయులను నియమించాలన్నారు. కార్యక్రమంలో జాక్టో నాయకులు స్వామి నాయక్, ఎం శ్రీనివాస్, మహేష్ కులకర్ణి, రమేష్ చౌహాన్, రవితేజ, గంగాధర్ సాయిలు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

లావణి పట్టకూ రుణాలు అందజేస్తాం

- ఐడిసిఎంఎస్ చైర్మన్ తారాచంద్ నాయక్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

సహకార సొసైటీ నుంచి అన్ని రంగాల్లో ముందుంచి నెంబర్‌వన్ చేయడమే ధ్యేయమని, సహకార సొసైటీ అభివృద్ధికి ప్రత్యేక కార్యచరణతో ముందుకు వెళ్తామని, ఇకనుండి అసైన్డ్, లావాణి పట్టా కలిగి ఉండి పాసుబుక్ ఉన్న వారందరికీ సహకార సొసైటీలో రుణాలను అందజేస్తామని సహకార సొసైటీ చైర్మన్, ఐడిసిఎంఎస్ చైర్మన్ తారచంద్ నాయక్ అన్నారు. శనివారం సొసైటీ మహాజన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 6 నెలల నుంచి సంఘంలో జరిగిన ఆర్థిక లావాదేవీలను పరిశీలించి ఆమోదించారు. సంఘం సభ్యత్వం కోరకు వచ్చిన దరఖాస్తులను పరిశీలించి, వాటధనం రూ.1000, ప్రవేశ రుసుం రూ.100గా నిర్ణయించి తీసుకోవాలని మహాజన సభ ఏకగ్రీవంగా తీర్మానించారు. సంఘం ద్వారా ఇచ్చిన పాత దీర్ఘకాలిక అప్పులు చెల్లించిన వారికి వన్ టైమ్ సెటిల్మెంట్ చేయుటకు మహాజన సభ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. సంఘంలో ఉన్న పాత స్వల్పకాలిక అప్పులకు వారి వాటాధనం నుండి ఋణఖాతాకు సర్దుబాటు చేసి ఉపశమనం కలిగించాలని వివరించారు. సమావేశంలో పలు తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ కార్యక్రమంలో సీఈవో జి.నాగరాజ్, సొసైటీ వైస్ చైర్మన్ పోడెడ్ల స్వామి, డైరెక్టర్లు కాయితి రాజ్‌కుమార్, శేఖర్, పాపనోల్ల గంగారాం, కుమ్మరి నర్సయ్య, బొక్క గంగాధర్, స్టాఫ్ అసిస్టెంట్ డి.నాగేశ్వరరావు, కంప్యూటర్ ఆపరేటర్ ఎం.సాయికుమార్, మాజీ సర్పంచ్‌లు తిరుపతి, తేలు గణేష్, ఆశన్న, రవి, వీరప్రభూ ఆయా గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఐడిసిఎంఎస్ చైర్మన్ తారాచందర్ నాయక్

జిల్లాస్థాయి యువజనోత్సవాలలో విజయ్ విద్యార్థులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

జిల్లా యువజన, క్రీడల కార్యాలయం ఆధ్వర్యంలో 28వ జాతీయ యువజనోత్సవాలలో భాగంగా జిల్లాస్థాయి ఉత్సవాలు 2024-25 సంవత్సరంలో జిల్లాలోని 15 సంవత్సరాల నుండి 29 సంవత్సరాల మధ్య ఉన్నయువ కళాకారులను ప్రోత్సహించుటకు న్యూ అంబేద్కర్ భవన్ వేదికగా శుక్రవారం కళారంగాలు, కథ, కవితా రచన, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో విజయ్ హైస్కూల్లో 10వ తరగతి చదివే విద్యార్థులు కథా ప్రక్రియలో భారతీయ సంస్కృతి విలువల అనే అంశంపై పాల్గొని పి.శ్రీనిధి ప్రథమ స్థానం, పి.శరణ్ తేజ ద్వితీయస్థానం, కవిత్వ రచనలో ఖుషి బుద్ధదేవ్ ద్వితీయ స్థానం, వక్తృత్వ పోటీలలో దేశాభివృద్ధిలో యువత పాత్ర అనే అంశంపై పాల్గొని బి.తనూశ్రీ ప్రథమస్థానం, రౌధ జహన్ ద్వితీయస్థానంలో నిలిచి మెమోంటో, ప్రశంసాపత్రాలు అందుకున్నట్టు స్కూల్ యాజమాన్యం తెలిపింది. నాటిక విభాగంలో 9వ తరగతి చిన్నారి విజితేంద్రియ రచించిన 'గ్లోబల్ వాటర్ క్రైసిస్' అనే ఆంగ్ల నాటిక ప్రథమస్థానంలో నిలిచింది. వివిధ విభాగాలలో ప్రథమస్థానంలో నిలిచిన విజేతలు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని యాజమాన్యం ప్రకటించింది. ఈ సందర్భంగా జిల్లాస్థాయి యువజనోత్సవాలలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను విజయ్ హైస్కూల్ వ్యవస్థాపకులు డా. అమృతలత విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయ బృందం

సాలూర మండల ఎంఈఓకు సన్మానం

నవతెలంగాణ-బోధన్

సాలూర మండలానికి తొలి ఎంఈఓగా బాధ్యతలు చేపట్టిన రాజి మంజూషను శనివారం సాలూర ప్రజ్ఞశ్రీ హైస్కూల్ కరస్పాండెంట్ లతరాజు, హెచ్ఎం భవాని శాలువ పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాలూర మండలం ఏర్పడిన సందర్భంగా తొలి మండల విద్యాధికారిగా సాలూర జడ్పీహెచ్ఎస్ హెచ్ఎం రాజి మంజూష మేడం ఎంఈఓగా బాధ్యతలు చేపట్టడం మండల వాసులకు ఎంతో శుభదినమని అన్నారు. మండలంలో విద్యార్థుల ఉత్తీర్ణత శాతం మరింతగా పెరిగే అవకాశం ఉంటుందని ఆకాంక్షించారు.

ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలి

- వైద్యాధికారిని డాక్టర్ మానస

నవతెలంగాణ-ఆర్మూర్

ఇంటి పరిసర ప్రాంతాలలో నీరు నిల్వ ఉండకుండా చూడాలని గోవింద్‌పేట్ ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం వైద్యాధికారిని డాక్టర్ మానస అన్నారు. మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లిలో శనివారం ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రంలో జ్వర సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంటి పరిసరాలలో కొబ్బరి చిప్పలు, పాత టైర్లు, కుండలు, పూల కుండీలు, పాత డబ్బాలు పనికిరాని వస్తువులను ఉంచుకోకూడదని, దీనివల్ల వర్షం పడి నీరు నిలువలు ఏర్పడి దానిలో డెంగ్యూ దోమ వృద్ధి చెందుతుందని తెలిపారు. ఎప్పటికప్పుడు ఇంటి పరిసరాలను వారానికి ఒకసారి శుభ్రం చేసుకోవాలని సూచించారు. టైర్లలో నీటి నిలువలను సిబ్బందితో తొలగింపజేశారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్త జక్కుల మోహన్, ఆశా కార్యకర్తలు సుభద్ర, రమ, నవ్య, మమత తదితరులు పాల్గొన్నారు.

బిఎస్ఎన్ఎల్ టవర్ కోసం వినతి

నవతెలంగాణ-నవీపేట్

మండలంలోని నందిగాం గ్రామంలో బిఎస్ఎన్ఎల్ టవర్ నిర్మించాలని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్‌కు గ్రామస్తులు శనివా రం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా గ్రామంలో బిఎస్ఎన్ఎల్ సిగ్నల్స్ రాకపోవడంతో చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వెంటనే స్పందించి తమ గ్రామంలో బిఎస్ఎన్ఎల్ టవర్ నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు సంజీవ్, భూమ్ రావు, ప్రభాకర్ రావు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
ఆదివారం సెప్టెంబర్ 28, 2024 www.navatelangana.com

సొసైటీ కార్యదర్శిపై విచారణ చేపట్టాలి

- కార్యదర్శి అవినీతిపై విచారణ కోసం తీర్మానం

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని కోనసముందర్ సింగిల్ విండో కార్యదర్శి రాజేశ్వర్‌పై జిల్లా సహకార అధికారి విచారణ నిర్వహించాలని కోరుతూ తీర్మానం చేశారు. శనివారం కొనసముందర్ సింగిల్ విండో కార్యాలయంలో విండో చైర్మన్ సామా బాపురెడ్డి అధ్యక్షతన 10వ మహాజన సభను నిర్వహించారు. ఈ సందర్భంగా విండోపాలకవర్గ సభ్యులు పలు తీర్మానాలు చేశారు. కార్యక్రమంలో సొసైటీ ఉపాధ్యక్షులు ఆకుల రాజన్న, డైరెక్టర్లు బండి నారాయణ, గణేష్, రాజేశ్వర్ రెడ్డి, నల్ల గంగాధర్, జీవన్, గ్రామ రైతులు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న పాలకవర్గ సభ్యులు

మంచిప్ప గ్రామంలో రెజ్లింగ్ పోటీలు ప్రారంభం

నవతెలంగాణ-మోపాల్

మండలంలోని మంచిప్ప గ్రామంలో శనివారం రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి రెజ్లింగ్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మంచిప్ప ప్రాజెక్టును పాత డిజైన్ ప్రకారమే నిర్మించాలని గ్రామస్తులు ఆయనను కోరగా కచ్చితంగా పాత డిజైన్ ప్రకారమే నిర్మిస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పిసిసి డెలిగేట్ శేఖర్ గౌడ్, ఎస్టీ సెల్ అధ్యక్షుడు యాదగిరి, మోపాల్ మండల అధ్యక్షుడు సాయి రెడ్డి, బాడ్సి సొసైటీ చైర్మన్ మోహన్ రెడ్డి, సాయిరాం, రాజేష్, ఎలక్ట్రికల్ ఏఈ బాబా శ్రీనివాస్, పిఆర్ఏఈ మౌనిక, తదితర నాయకులు ప్రజలు అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే

కీలకమైన అవయవం గుండె

- గుండె ఆరోగ్యమే మనం ఆరోగ్యం
- ప్రముఖ గుండె వైద్య నిపుణులు, కృష్ణ కార్డియాక్ కేర్ డాక్టర్ వంశీకృష్ణ

నవతెలంగాణ-ఆర్మూర్

పిడికెడు గుండె మన జీవితాన్ని నిర్దేశిస్తుందని గుండె మనకు అత్యంత కీలకమైన అవయమని, గుండె ఆరోగ్యంగా ఉంటే మనం ఆరోగ్యంగా ఉంటామని పట్టణానికి చెందిన కృష్ణ కార్డియాక్ కేర్ గుండె వైద్య నిపుణులు వంశీకృష్ణ కొట్టుర్ అన్నారు. ఆరోగ్య కరమైన ఆహారం, శరీరా నికి వ్యాయామం, దురలవాట్లకు దూరంగా ఉండ డం గుండె ఆరోగ్యానికి రాచబాట వేస్తాయని, సమయానికి నిద్రపోవడం, ఒత్తిడిని తగ్గించు కోవడం, పొగాకును మానుకుంటే చాలు గుండె పోటు వచ్చే ప్రమాదం తప్పినట్లేనని ఆయన తెలిపారు. నేడు వరల్డ్ హార్ట్ డే సందర్భంగా నవతెలంగాణకు ఆయన ప్రత్యేక ఇంటర్వ్యూనిచ్చారు.

నవతెలంగాణ : హార్ట్ స్ట్రోక్ వచ్చినట్టు ఎలా గుర్తించడం?

డాక్టర్ : షుగర్, బిపి, గుండె దడ, కాళ్ళ వాపు, దమ్ము దగ్గు, చాతి నొప్పి నీరసంగా ఉండడంతో పాటు, ఛాతినొప్పి వచ్చి కనీసం 20 నిమిషాల తర్వాత అయినా తగ్గకపోవడం, అస్థిరంగా రొమ్ము నొప్పి, రక్తపోటు అధికమ వడం, గుండె పని విధానంలో అసాధారణంగా ఉండటం లాంటివి కనిపించగానే వైద్యుడిని సంప్రదించాలి.

చిన్న వయసు, యుక్త వయసు వాళ్లకు గుండె జబ్బులు రావడానికి కారణాలు?



గత కొన్ని సంవత్సరాల నుండి చిన్న వయసులో కొంతమంది పిల్లలకు గుండెకు రంధ్రాలు ఏర్పడతాయి. చికిత్స అందిస్తే టీనేజ్లో గుండె జబ్బు రాదు. లేకుంటే పుట్టుకతో గుండె జబ్బులు ఉన్న కొందరిలో ఆ ప్రభావం టీనేజ్లో కనిపి స్తుంది. విద్యార్థులు జంక్ ఫుడ్, స్నాక్స్‌ను ఇష్టంగా తింటుంటారు. టిఫిన్ మొదలు రాత్రి భోజనం వరకు పిల్లల ఆహారంలో జంక్ ఫుడ్ ఉంటుంది. అలాంటివి తినడం ద్వారా కొలెస్ట్రాల్ శాతం పెరిగి రక్తనాళాల్లో పేరుకు పోతుంది. ఐదు నుంచి 15 సంవత్సరాల వయసులోనే జంక్ ఫుడ్ ప్రాసెస్ ఫుడ్‌కు అలవాటు పడిన వారిలో 15 నుంచి 20 ఏళ్లు వచ్చేసరికి రక్తనాళాల్లో బ్లాకులు ఏర్పడుతున్నాయి.

విపరీతమైన ఒత్తిడి.. సోషల్ మీడియా ప్రభావం గుండెపై ఏ విధంగా ఉంటుంది?

ముఖ్యంగా విద్యార్థులు విపరీతమైన ఒత్తిడికి గురవుతున్నారు. ఉదయం 5 నుండి మొదలుకొని అర్ధరాత్రి వరకు చదువులు సాగిస్తుండడం నిద్రపోయే సమయం తక్కువగా ఉండడం మార్కులు రావాలని, ర్యాంకులు సాధించాలనే తాపత్రయంతో తల్లిదండ్రులు పిల్లల ఆరోగ్యంపై అశ్రద్ధ చేయడం. ఒకవైపు కాగా టీవీ సోషల్ మీడియాలో కాలక్షేపం చేస్తూ చాలామంది అర్ధరాత్రి వరకు నిద్రపోవడం లేదు. ఉదయం పూట పడుకోవడం ద్వారా హార్మోన్లు దెబ్బతింటున్నాయి. పడుకునే వేళల్లో పనిచేయడం, పనిచేసే సమయాల్లో పడుకోవడం ద్వారా గుండె పనితీరులో తేడా ఉంటుంది. రాత్రిళ్లు మేలుకువ ఉండే వారిలో గుండె జబ్బులు అధికంగా ఉంటున్నాయి.

ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి ?

40 సంవత్సరాలు నిండిన తర్వాత ప్రతి ఒక్కరు గుండె వైద్య నిపుణుల దగ్గర చెకప్ చేయించుకోవాలి. నేటి యువతలో స్మోకింగ్ ప్రభావం అధికంగా ఉంది. ప్రతిరోజు 30 నిమిషాల వరకైనా వ్యాయామం చేయాలి. పండ్లు, ఆకుకూరలు, ఫిష్ ఆహారంలో తీసుకో వచ్చు. నూనె వస్తువులు తక్కువగా వాడా లి. మద్యపానం, డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి. ధ్యానం, ప్రాణాయామం చేయాలి. నేటి యువత ట్రెండు పేరా మత్తుకు బానిస కావద్దు. ప్రతి చిన్న విషయాన్ని ఎక్కువగా ఆలోచించి ఒత్తిడికి గురికావొద్దు. జీవనశైలి మార్పుల వల్ల గుండె జబ్బుల ముప్పు అధికమవుతుంది. ఒత్తిడి లేని జీవనశైలిని అలవర్చుకోవాలి.

మీ హాస్పిటల్‌కు వచ్చే వారికి ఏ విధమైన చికిత్సలు అందిస్తున్నారు?

పట్టణంలోని డాక్టర్ లైన్ మహాలక్ష్మి కాలనీలో గల కృష్ణ కార్డియాక్ కేర్ వచ్చేవారికి మంచి వైద్యం అందిస్తూ క్రిటికల్ కేర్ కేసులు సైతం చేస్తున్నాం. పేద, మధ్యతరగతి వారికి సైతం చికిత్సలు అందించడంలో నేను, మా ఆసుపత్రి సిబ్బంది పూర్తి సహాయ సహకారాలు అందిస్తున్నాం.

జాగ్రత్తలు తీసుకుంటే గుండె జబ్బులు దూరం

- యశోద హాస్పిటల్ సీనియర్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ గోపి కృష్ణ రాయిడి

నవతెలంగాణ-కంఠేశ్వర్



మనిషి బతుకుకు ముఖ్యమైన గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవడం చాలా ముఖ్యమని అందుకోసం గుండె జబ్బులకు కారణాలను తెలుసుకుని ముందుగా జాగ్రత్త పడటం మంచిందని యశోద హాస్పిటల్ సీనియర్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ గోపి కృష్ణ రాయిడి తెలిపారు. ఆదివారం వరల్డ్ హార్ట్ డే సందర్భంగా నవతెలంగాణతో ఆయన ప్రత్యేకంగా మాట్లాడారు.

'ఎప్పుడైతే హార్ట్ అటాక్ వచ్చినప్పుడు మీకు ఫలానా రిస్క్ ఫాక్టర్స్ ఉన్నాయి. అందుకే హార్ట్ అటాక్ వచ్చిందని చెబుతారు. ఆ రిస్క్ ఫాక్టర్స్ ఏమిటంటే? డయాబెటీస్, కొలెస్ట్రాల్, స్మోకింగ్, ఆల్కహాల్ సేవించడం, హై బ్లడ్ ప్రెషర్, ఒత్తిడితో కూడిన జీవితం, ఎప్పుడు కూర్చునే ఉండటం, కుటుంబ ఆరోగ్య చరిత్ర, గుర్తించని కారణాలు ఉన్నాయని తెలిపారు. హార్ట్ అటాక్ వచ్చిన తర్వాత ఆంజియో ప్లాస్టీ చేయడం గానీ, బైపాస్ సర్జరీ చేయడం జరుగుతుంది. దానితో పాటు నిర్వహణ కోసం ఔషధాలు ఇస్తాం.

డయాబెటీస్..

చాలా మందికి హార్ట్ అటాక్ వచ్చేంత వరకు వారికి డయాబెటీస్ ఉన్న విషయం తెలియదు. కొందరికి డయాబెటీస్ ఉన్న విషయం తెలుసు. ఔషధాలు రెగ్యులర్‌గా తీసుకోవడం తెలుసు. కానీ అది నియంత్రణలో లేదన్న సంగతి తెలియదు. కార్డియాక్ రిహాబ్ ద్వారా శరీరంలో ఉన్న కండరాలు పనితీరు పెరుగుతుంది. దానివల్ల కండరాల గ్లూకోస్ తీసుకోవడం పెరిగిపోతుంది. డయాబెటీస్ అనే రిస్క్ ఫ్యాక్టర్ తగ్గిపోయి మరో హార్ట్ అటాక్ రాకుండా కాపాడుకోవచ్చు.

కుటుంబ చరిత్ర..

కొన్ని హార్ట్ అటాక్‌లు కుటుంబంలో వారసత్వంగా వస్తుంటాయి. ఎందుకంటే ఈ సమస్య వారి జన్యువుల్లో ఉంటుంది. ఈ జన్యువులను కూడా సరి చేసుకోవచ్చు. దాన్నే ఎపీ జెనెటిక్స్ అంటారు. జీవనశైలి ద్వారా జన్యువుల్లో లోపాలను సరి చేసుకోవచ్చు. ఏ కుటుంబంలోనైతే ఈ జన్యువులున్నాయో కార్డియాక్ రిహాబ్ చేసుకోవడం ద్వారా వారి జన్యువులు మారిపోయి హార్ట్ అటాక్ రాకుండా దూరమవుతుంది.

హై బ్లడ్ ప్రెషర్..

దీర్ఘకాలికంగా హైపర్ టెన్షన్ ఉండటం వల్ల గుండె బాగా గట్టిపడి దాని కండరాలు గదుల సైజు చిన్నగా అవుతుంది. దీని వల్ల హార్ట్ అటాక్ వచ్చే అవకాశాలుంటాయి. కార్డియాక్ రిహాబ్ ద్వారా పాజిటివ్ మార్పులు గుండె కండరాల్లో వస్తాయి. దీంతో గదుల సైజు పెరుగుతుంది. దీన్ని ఎక్సెంట్రిక్ డయలటేషన్ అంటారు. ఇలాంటి మార్పే ప్రొఫెషనల్ అథ్లెటిక్స్ కూడా ఉంటుంది. తద్వారా హార్ట్ అటాక్ అనేది నివారించుకోవచ్చు.

ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసిన దుండగులు

నవతెలంగాణ-బోధన్

మండలంలోని రాజీవ్‌నగర్ తాండా పంచాయతీ పరిధిలో శుక్రవారం రాత్రి గుర్తుతెలియని దుండగులు ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసంచేసి అందులోనూ విలువైన కాయిల్స్‌ను దొంగిలించారని మాజీ సర్పంచ్ రంజనాయక్ తెలిపారు. సంబంధిత శాఖ అధికారులకు సమాచారం ఇవ్వగా పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అలాగే బోధన్ పట్టణ శివారులోని గోసం బస్తీ సమీపంలో రెండు ట్రాన్స్‌ఫార్మర్‌లను సైతం దుండగులు ధ్వంసం చేసి విలువైన సామగ్రిని దొంగిలించారు. శుక్రవారం అర్ధరాత్రి బేల్లాల్ శివారు వ్యవసాయ కనెక్షన్ కోసం ఏర్పాటు చేసిన ఈ 16కేవి, 20కేవి ట్రాన్స్‌ఫార్మర్లు పగులగొట్టి కాయిల్ చోరీ చేయడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ట్రాన్స్‌ఫార్మర్‌లోని కాయల్స్, ఆయిల్ దొంగలు ఎత్తుకెళ్లారు. శనివారం ట్రాన్స్‌కో అధికారులు పరిశీలించి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పోషకాహార అవగాహన సదస్సు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

న్యూ అంబేద్కర్ భవన్‌లో నిజామాబాద్ అర్బన్ ప్రాజెక్టు పరిధిలో పోషణ మాసం కార్యక్రమం నిర్వహించారు. సీడీపీవో నందిని ఆధ్వర్యంలో పోషకాహార అవగాహనా సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఉమెన్ కమిషన్ మెంబర్ సూధం లక్ష్మీ, డిప్యూటీ డిఎంహెచ్ఓ అంజన పాల్గొన్నారు.

టీయూ భూములను కాపాడాలని వినతి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

తెలంగాణ యూనివర్సిటీకి చెందిన 50 ఎకరాల భూమిని కాపాడాలని ప్రగతీ శీల ప్రజాసామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ జిల్లా కలెక్టర్‌ను కోరారు. శనివారం కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతుకు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో పి.డి.ఎస్.యూ నాయకులు ప్రిన్స్, రవీందర్, శివసాయి, వంశీ తదితరులు పాల్గొన్నారు.

జాషువాకు నివాళి

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం ఆధ్వర్యంలో జాషువాకి కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండగంగాధర్ జిల్లా కార్యాలయంలో గుర్రం జాషువాకి పూలమాలలు వేసి శనివారం నివాళులర్పించారు. కార్యక్రమంలో కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా ఉపాధ్యక్షులు నలవాల నరసయ్య సతీష్, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి విగ్నేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు, పాల్గొన్నారు.

టీయూలో అక్టోబర్ 3న బతుకమ్మ ఉత్సవాలు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ సందీప్ సుల్తానియా ఐఏఎస్ ఆదేశానుసారం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.యాదగిరి సూచన మేరకు అక్టోబర్ 3న కంప్యూటర్ సైన్స్ బిల్డింగ్‌లో బతుకమ్మ ఉత్సవాలు నిర్వహిస్తున్నట్టు ఉమెన్ సెల్ డైరెక్టర్ డాక్టర్ ఎం.భ్రమరాంబిక శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ బతుకమ్మ ఉత్సవాలను టీచింగ్, నాన్ టీచింగ్ మహిళలందరు పాల్గొని విజయవంతం చేయాలని డైరెక్టర్ పేర్కొన్నారు.

1వరకు పీజీ బ్యాక్‌లాగ్ పరీక్షల రీవాల్యుయేషన్ ఫీజు చెల్లించొచ్చు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని పీజీ పరీక్షల రివాల్యుయేషన్ తేదీని తెలంగాణ యూనివర్సిటీ కంట్రోలర్ శనివారం ప్రకటించారు. ఆగస్టు, 2024లో జరిగిన బ్యాక్‌లాగ్ పీజీ కోర్సెస్ (ఇంటిగ్రేటెడ్ కోర్స్ ఏపీ ఈ.పిసిహెచ్. ఐఎంబిఏ) ఎల్ఎల్‌బి ఒకటవ, మూడవ, నాలుగవ, ఐదవ సెమిస్టర్ బ్యాక్‌లాగ్, పీజీ (ఇంటిగ్రేటెడ్ కోర్స్ ఏపీఈ. పిసిహెచ్. ఐఎంబిఏ), ఎల్ఎల్‌బి ఆరవ సెమిస్టర్ రెగ్యులర్ బ్యాక్‌లాగ్ ఈ పరీక్షలకు హాజరైన వారికి మాత్రమే ఈ అవకాశం కలిగి ఉంటుందని, ఒక్కొక్క పేపర్‌కు రివాల్యుయేషన్ రూ.500 చెల్లించాలని పేర్కొన్నారు. ఈ రివాల్యుయేషన్‌కు ఫీజు చెల్లింపు చివరి తేదీ అక్టోబర్ 1అని యూనివర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారిని ప్రొఫెసర్ డాక్టర్ ఎం.అరుణ తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మండల విద్యాధికారికి సన్మానం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

మండల విద్యాధికారిగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఈఎల్ఎన్ శ్రీనివాస్ రెడ్డిని డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (యూటిఎఫ్) ప్రతినిధుల ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ నాయకులు రాసరి పెంటన్న, బాల్‌రాజ్, చంద్రశేఖర్, అబ్దుల్ హకీం, బచ్చు రమేష్, రవి, పాల్గొన్నారు.

నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలో కొనసాగుతున్న చీమన్‌పల్లి, గిరిజన సంక్షేమ గురుకుల బాలుర కళాశాలలో శనివారం ఉపాధ్యాయులు పెన్‌డౌన్, చాక్ డౌన్ కార్యక్రమం నిర్వహించారు. గురుకుల విద్యా జే.ఏ.సి. పిలుపు మేరకు గురుకులాలలో ఉన్నటువంటి సమస్యలను పరిష్కారించాల్సిందిగా కోరుతూ ఉపాధ్యాయులందరు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు.

సొసైటీ మహాజన సభ

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

సింగిల్ విండో మహాజన సభను మండల కేంద్రంలోని సొసైటీ గోదాం ఆవరణలో చైర్మన్ రేగుంట దేవేందర్ అధ్యక్షతన శనివారం నిర్వహించారు. విండో మహాజన సభలో 2023-24 సంవత్సరానికి సంబంధించిన సింగిల్ విండో ఆర్థిక లావాదేవీలను విండో కార్యదర్శి ఉట్నూరి శంకర్ మహాజన సభలో చదివి వినిపించారు. ఈ సందర్భంగా రుణమాఫీ కానీ రైతులకు ఎలాంటి ఆంక్షలు లేకుండా రుణమాఫీ అయ్యేలా కృషి చేయాలని, సంఘం ద్వారా సోయాబీన్ మద్దతు ధరకు కొనుగోలు చేయాలని తెలిపారు. సంఘం ద్వారా వడ్ల కొనుగోలు కేంద్రాంకు ఏర్పాటు చేసి మద్దతు ధర ద్వారా కొనుగోలు చేసి, ప్రతి క్వింటాలుకు రూ.500 బోనస్ ఇవ్వాలని సభకు హాజరైన సభ్యులు, రైతుల మద్దతుతో ఏకగ్రీవంగా తీర్మానించి ఆమోదించారు. కార్యక్రమంలో సొసైటీ వైస్ చైర్మన్ అరుణ్, సొసైటీ డైరెక్టర్లు నందగిరి వెంకట్, రేంజర్ల మహేందర్, సంఘ సభ్యులు, సంఘ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితా ప్రదర్శన

నవతెలంగాణ-బాల్కొండ



తెలంగాణా రాష్ట్ర ఎన్నికల సంఘం, జిల్లా ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు గ్రామ పంచాయతీ రెండవ సాధారణ ఎన్నికల కొరకు శనివారం మండల పరిధిలోని 10 గ్రామ పంచాయతీలలో వార్డు వారీతుది ఓటర్ల జాబి తాను గ్రామ పంచాయతీలలో, మండల ప్రజా పరిషత్ కార్యాలయంలోని నోటీసు బోర్డులపై ప్రదర్శించారు. కార్యక్రమంలో బాల్కొండ మండల పరిషత్ అభివృద్ధి అధికారి విజయభాస్కర్‌రెడ్డి, మండల పంచాయతీ అధికారి ఆర్.గంగామోహన్, కార్యాలయ పర్యవేక్షకులు రమణ, జూనియర్ అసిస్టెంట్ నిశాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

కళాశాల అభివృద్ధికి సహకరిస్తాం

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

తెలంగాణలోనే పేరెన్నికగన్న గిరిరాజ్ ప్రభుత్వ కళాశాల అభివృద్ధికి అన్ని విధాలుగా సహకరిస్తామని పూర్వ విద్యార్థులు పేర్కొన్నారు. శనివారం గిరిరాజ్ కళాశాల ప్రాంగణంలో అల్యూమిని అసోసియేషన్ ఆధ్వర్యంలో పూర్వ విద్యార్థుల సమావేశం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ రామ్మోహన్ రెడ్డి అధ్యక్షత వహించి మాట్లాడుతూ.. గిరిరాజ్ కళాశాల రాష్ట్రంలోనే గుర్తింపు పొందిందని, విద్యార్థులకు అన్ని విధాలుగా నైపుణ్యాలు పెంపొందించేందుకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికే కళాశాలలో 26 నూతన గదులతో కూడిన భవన నిర్మించినట్లు పేర్కొన్నారు. ఇంకా అవసరమైన మౌలిక వసతులు కల్పనకు, నూతన భవనాల నిర్మాణం కోసం పూర్వ విద్యార్థులు సహాయం అందించాలని పేర్కొన్నారు. త్వరలోనే న్యాక్ గుర్తింపు కోసం కళాశాల వెళ్తున్నట్లు ఇందుకోసం ప్రతి పూర్వ విద్యార్థి తమ వంతు బాధ్యతగా సహకరించాలని ప్రిన్సిపల్ కోరారు. సమావేశంలో ప్రముఖ న్యాయవాదులు రాజేందర్ రెడ్డి, కృపాకర్ రెడ్డి పూర్వ విద్యార్థులు, విశ్రాంత అధ్యాపకులు రవీంద్రనాథ్, శ్రీనివాస్, తెలంగాణ శంకర్, హెల్పింగ్ హాండ్స్ తదితరులు ఆర్థిక సాయం ప్రకటించారు. సమావేశంలో విశ్రాంత అధ్యాపకులు రాజేంద్ర సాగర్, నాగరాజు, వైస్ ప్రిన్సిపల్ అబ్దుల్ రఫీక్ రంగరత్నం, ఎన్సీసీ అధికారి రామస్వామి వివిధ విభాగాల అధిపతులు అధ్యాపకులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

ఈవ్ టీజింగ్‌పై అవగాహన

నవతెలంగాణ-మోర్తాడ్

మండల కేంద్రంలోని సంస్కృతి గ్లోబల్ స్కూల్‌లో విద్యార్థులకు శనివారం ఈవ్‌టీజింగ్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు కాంచన, పోలీస్ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పెర్కిట్‌లో పోషణ మహా

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని పెర్కిట్‌లోని మహిళా భవనంలో పోషణ మాసంలో భాగంగా శనివారం పోషణ మహా నిర్వహణ కార్యక్రమం నిర్వహించారు. గర్భిణులకు సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసన చేపట్టారు. కార్యక్రమంలో అంగన్వాడి టీచర్స్ హెల్పర్స్ టీఎన్జీవో జిల్లా అధ్యక్షురాలు తార, డాక్టర్స్ మానస మైత్రి తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారం తీసుకోవాలి

నవతెలంగాణ-మోర్తాడ్

గర్భిణీలు, బాలింతలు తప్పనిసరిగా పోషకాహారం తీసుకోవాలని ఐసిడిఎస్ సూపర్వైజర్ పుష్పలత అన్నారు. శనివారం మండల కేంద్రంలోని అంగన్వాడీ సెంటర్లో జరిగిన పోషణ మాసం సందర్భంగా ఆమె మాట్లాడి పలు సూచనలు చేశారు. కోఆర్డినేటర్ ప్రసన్న, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

15 ఫోన్లు రికవరీ

నవతెలంగాణ-కంఠేశ్వర్

జిల్లా కేంద్రంలోని రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో 15 ఫోన్‌లను రికవరీ చేసినట్టు రైల్వే ఎస్సై సాయిరెడ్డి శనివారం తెలిపారు. రైల్వేస్టేషన్ ఆవరణలోని విలేకరుల సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు. సెప్టెంబర్ నెలలో మొత్తం 15 ఫోన్లు రికవరీ చేసి బాధితులకు అప్పగించినట్టు తెలిపారు. ఫోన్‌ల రికవరీలో సిబ్బంది గురుదాస్, రాములు, నజ్మాలను అభినందించారు.

అక్టోబర్ 5న గెజిటెడ్ ఆఫీసర్ అసోసియేషన్ జిల్లా కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-కంఠేశ్వర్

జిల్లాలో తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లా కమిటీ ఎన్నికలను వచ్చే నెల అక్టోబర్ 5న నిర్వహించనున్నట్టు తెలంగాణ డిజిటల్ ఆఫీసర్స్ అసోసియేషన్ నుంచి శనివారం ప్రకటన విడుదల చేశారు. ఎన్నికల అధికారి, కామారెడ్డి డీటీవో కే.శ్రీనివాస్‌రెడ్డి నోటిఫికేషన్ విడుదల చేశారు. 5వ తేదీన ఉదయం 9గంటలకు నిజామాబాద్ టీఎన్జీవో భవనంలో ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కానుందని పేర్కొన్నారు.

ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తికి ఆర్థిక సాయం

నవతెలంగాణ-ఎడపల్లి

మండలంలోని అంబంవై గ్రామానికి చెందిన గోపర్ రమేష్, (మహేష్), అనే వ్యక్తి ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగలడంతో గాయపడ్డారు. ఆ విషయం తెలుసుకున్న బీజేపీ సీనియర్ నాయకుడు కందగట్ల రామాచందర్, రమేష్ ఆరోగ్య విషయాలను తెలుసుకున్నారు. అనంతరం రామాచందర్ మాట్లాడారు.. మెరుగైన చికిత్స నిర్వహించుకుని, ఆరోగ్యంగా ఉండాలంటూ ఆయనకు మనో ధైర్యం నింపారు. అనంతరం కందగట్ల రామచందర్, గోపరి రమేష్ అనే వ్యక్తికి నగదు రూ.5000 ఆర్థిక సాయం చేశారు. ఆయన వెంట మల్లెపూల శ్రీనివాస్, కంటడి గంగాధర్, తదితరులు ఉన్నారు.

ఎదిరించి పోరాడిన భగత్‌సింగ్

- సిపిఐ(ఎం) జిల్లా కార్యదర్శి రమేష్ బాబు నివాళి

నవతెలంగాణ-కంఠేశ్వర్

సామ్రాజ్యవాద విధానాలను ఎదిరించి దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన వ్యక్తి భగత్ సింగ్ అని సిపిఐ(ఎం) జిల్లా కార్యదర్శి రమేష్ బాబు అన్నారు. భగత్‌సింగ్ జయంతిని పురస్కరించుకొని సిపిఐ(ఎం) కార్యాలయంలో శనివారం భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లుఅర్పించారు. అనంతరం పార్టీ జిల్లా కార్యదర్శి రమేష్ బాబు మాట్లాడుతూ.. దేశ స్వాతంత్రం కోసం బ్రిటిష్ వారిని ఎదిరించి స్వాతంత్ర ఉద్యమంలో చిన్నతనంలోనే పాల్గొని బ్రిటిష్ వారిని గడగడలాడించిన వ్యక్తి భగత్ సింగ్ అని తెలిపారు. అప్పుడు ప్రపంచంలో తనకు ఎదురులేదని విర్రవీగుతున్న బ్రిటీష్ పాలకులను ఎదిరించి స్వాతంత్రం నా జన్మ హక్కు అని నినాదంతోటి ముందుకు కదిలిన మహానుభావుడు భగత్ సింగ్ అని వివరించారు. సింగ్ స్ఫూర్తిగా అనేకమంది యువకులు దేశ స్వాతంత్ర ఉద్యమంలో పాల్గొని త్యాగాలను చేశారని గుర్తుచేశారు. భగత్ సింగ్ ఉరికంబానికి ఎక్కినప్పటికీ ఏమాత్రం భయపడకుండా ఆ దేహం ముక్కలైనా దేశాన్ని ముక్కలు కానివ్వమని నినదించిన వ్యక్తి అని ఆయన స్ఫూర్తిగా నేటి యువత దేశ ప్రజల ఐక్యత కొరకు మతోన్మాదాన్ని ఎదిరించి సమస్యల పరిష్కారానికి పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నూర్జహాన్, జిల్లా కమిటీ సభ్యులు విగ్నేష్, పార్టీ కార్యకర్తలు గణేష్, కార్తీక్, సందీప్, పవన్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న నాయకులు

ఎల్ఈడి ట్యూబ్ లైట్లను తయారుచేసిన ఏర్గట్ల విద్యార్థులు

నవతెలంగాణ-ఏర్గట్ల

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎల్.ఈ.డి ట్యూబ్ లైట్ వర్క్ షాప్ భౌతికశాస్త్ర ఉపాధ్యాయులు గాండ్ల రాజశేఖర్ పర్యవేక్షణలో శనివారం నిర్వహించారు. ఎల్.ఈ.డీ ట్యూబ్ లైట్ తయారీకి కావలసిన వస్తువులను ప్రధానోపాధ్యాయులు కృష్ణాచారి అందించడంతో విద్యార్థులు వాటిని ఉపయోగించుకొని 50 ఎల్.ఈ.డీ ట్యూబ్ లైట్లను తయారు చేశారు. ఈ సందర్భంగా భౌతికశాస్త్ర ఉపాధ్యాయులు రాజశేఖర్, ప్రధానోపాధ్యాయులు కృష్ణాచారి మాట్లాడుతూ.. నేటి ప్రపంచమంతా సైన్స్, టెక్నాలజీ చుట్టూ పరుగులు పెడుతుందని, విద్యార్థి దశలోనే సైన్స్‌ను అలవాటు చేసుకోవాలని, సైన్స్ ద్వారా నేర్చుకున్న విద్య ప్రజలకు ఉపయోగపడేలా ఉండాలని అన్నారు. ఎల్ఈడి బల్బులు విద్యుత్‌ను ఆదా చేస్తాయని, వీటిని ప్రతి ఇంట్లో వాడితే బాగుంటుందని అన్నారు. ఇందులో పాఠశాల ఉపాధ్యాయులు మునిరోద్దీన్, ప్రసాద్, పవన్, రాజేంధర్, రాజనర్సయ్య, ఎస్.శ్రీనివాస్, సమిత, కె.శ్రీనివాస్, విజయ్ కుమార్, ప్రవీణ్ శర్మ, ఇందిరా, గంగాధర్, సబిత పాల్గొన్నారు.



లైట్లను తయారు చేస్తున్న విద్యార్థులు

పెంపుడు కుక్కలకు రేబీస్ టీకాలు వేయించాలి

నవతెలంగాణ-విలేకరుల బృందం

కమ్మర్‌పల్లి : ప్రతీ పెంపుడు కుక్కల యజమానులు తమ కుక్కలకు విధిగా రేబిస్ వ్యాధి నివారణ టీకాలు వేయించుకోవాలని మండల పశు వైద్యాధికారి డాక్టర్ రాజశేఖర్ రావు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని పశు సంవర్ధక శాఖ కార్యాలయంలో పెంపుడు కుక్కలకు రేబిస్ వ్యాధి నివారణ టీకాల వేసే కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మండల పశువైద్య సిబ్బంది వెటర్నరీ అసిస్టెంట్ చిత్ర సాయి, హెచ్ఏ స్వప్న, గోపాలమిత్ర స్వరన్, ఆఫీస్ సబార్డినేట్ గంగవ్వ, పెంపుడు కుక్కల యజమానులు, తదితరులు పాల్గొన్నారు.

మాక్లూర్ : మండల కేంద్రంలోని పశు వైద్యశాలలో మండల పశువైద్య, పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో పెంపుడు కుక్కలను ఉచిత రెబిస్ వ్యాధి నివారణ టీకాలను పశు వైద్యులు ఉమామ సాహెర్ శనివారం వేశారు. సుమారు 24 పెంపుడు కుక్కలకు రెబిస్ టీకాలను వేశారు. కార్యక్రమంలో విఎల్ఓటీ వనిత, జేవిఓఆర్ కల్యాణి, విఏ పాషా, ఎచ్ఏ మహేశ్వరి, పెంపుడు కుక్కల యజమానులు పాల్గొన్నారు.

ఆర్మూర్ : పట్టణంలోని ఏరియా వెటర్నరీ హాస్పిటల్‌లో, మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ ప్రాథమిక పశువైద్యశాలలో పెంపుడు శునకాలకు ఉచితంగా రేబిస్ వ్యాధి నివారణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పశు వైద్యాధికారులు జియాయుద్దీన్, లక్కం ప్రభాకర్ పాల్గొన్నారు.

బాల్కొండ : మండల కేంద్రంలోని పశు వైద్యశాలలో అధికారులు 20 శునకాలకు ఉచిత రేబీస్ టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో బాల్కొండ గ్రామ ప్రత్యేక అధికారి, ఎంపీడీవో విజయభాస్కర్‌రెడ్డి, ఎంపీఓ గంగ మోహన్, పశు వైద్యాధికారి డాక్టర్ గౌతమ్‌రాజ్, సిబ్బంది మల్లేష్, బషీర్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్మూర్ : కుక్కకు టీకాలు

ప్యూరిఫైడ్ వాటర్ మిషన్ వితరణ

నవతెలంగాణ-ఆర్మూర్

మండలంలోని చేపూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌కు మినరల్ వాటర్ ప్లాంట్‌ను దాత గడ్డ మీది లింగం గౌడ్ తన తండ్రి గడ్డ మీది ఈశ్వర్ గౌడ్ జ్ఞాపకార్థం శనివారం వితరణ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పట్టణ స్టేషన్ హౌస్ ఆఫీసర్ రవికుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు చేతనకుమారి, ఎంఈఓ రాజ గంగారాం, రిషిత హాస్పిటల్ అధినేత డాక్టర్ వెంకట్ గౌడ్, రవి గౌడ్ హాజరై ప్యూరిఫైడ్ ఆల్కలైన్ వాటర్ మిషను వారి చేతుల మీదుగా ప్రారంభించారు.

కొనసాగుతున్న మండల అంతర్ పాఠశాల క్రీడలు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రంలోని గ్రీన్ ఫీల్డ్ మినీ స్టేడియంలో అంతర్ పాఠశాలల క్రీడలు కొనసాగుతున్నాయి. జూనియర్ సబ్, జూనియర్ విభాగాల్లో జరుగుతున్న ఈ పోటీల్లో మండలంలోని ఆయా ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు పాల్గొంటున్నారు. శనివారం రాత్రి వరకు క్రీడలు ముగిసే ఆస్కారం ఉన్నట్లు క్రీడల కన్వీనర్ సాయన్న తెలిపారు.

పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారికి ప్రశంస పత్రాలు అందజేత

నవతెలంగాణ-ఎడపల్లి



మండల పరిధిలో గల తెలంగాణ గురుకుల బాలికల పాఠశాల కళాశాలలో చదువుతున్న పి.రుచిత, పి.పూజ అనే విద్యార్థులు నిజామాబాద్ జిల్లాలో చిత్రలేఖనం పోటీలలో జిల్లా స్థాయిలో మొదటి బహుమతి సాధించి, రాష్ట్రస్థాయికి ఎంపికైనట్టు పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ గంగాశంకర్ తెలిపారు. పి.రుచిత జానపద వ్యక్తి నృత్యంలో జిల్లాస్థాయిలో ద్వితీయ స్థానం సాధించినట్టు తెలిపారు. పి.పూజ చిత్రలేఖనం పోటీల్లో పాల్గొని మొదటి బహుమతి సాధించి, చిత్రలేఖన పోటీలకు ఎంపికైనట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రతిభా కనబరిచిన బాలికలను తెలంగాణ గురుకుల బాలికల పాఠశాల కళాశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ బృందం అభినందించారు.